1 KLVA 102M242

జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 12 విజయవాడ 20-10-2008 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీలలో.....

- నిర్మాణ కృషి-కొమన్‌ఫాం
- చేనేతరంగ సంక్షోభం-మౌలిక పరిష్కారాలు
- దోపిడీకి గురౌతున్న సుబాబుల్ రైతాంగం
- జన్యుమార్పిడి పంటలకు అమెరికా రైతుల నిరాకరణ
- భైంసా ఘటనలు-కార్మిక శక్తుల కర్తవ్యం
- టెర్రరిస్టుల వేట పేరిట హక్కుల కాలరాచివేత

కోస్టల్ కారిడార్:

నిర్వాసితులను మోసపుచ్చే వాదనలు

వాన్‌పిక్ పేరిట రైతాంగం భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం పూనుకుంది. మా భూముల నప్పగించి జీవనోనాపాధిని కోల్పోయేది లేదంటూ ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. గ్రామసభలు జరిపి ప్రజలు ఆమోదం తెలిపినప్పుడే ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టలన్న తమ రాజ్యాంగ చట్టాన్నే ఉల్లంఘించటమేకాక భూములు వదులుకోవటానికి నిరాకరిస్తున్న రైతాంగంపై నిర్బంధాన్ని ప్రయోగించటానికి ప్రభుత్వం పూనుకుంది. ఒకవైపున నిర్బంధం అమలు జరుపుతూనే, మరోవైపున నిందా ప్రచారానికి పూనుకుంది.

రాష్ట్ర కాంగ్రెసు కమిటీ ప్రతినిధి తులసిరెడ్డి వాన్‌పిక్‌ను వ్యతిరేకించేవారు అభివృద్ధి వ్యతిరేకులన్నాడు. ప్రభుత్వం రైతులను మత్స్యకారులను తరిమివేస్తున్నదని ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయనీ ఆరోపించాడు. మత్స్యకారుల కోసమే ఫిష్‌లాండింగుతో, రోడ్లనూ నిర్మిస్తున్నామనీ, ఇది అభివృద్ధినీ తెస్తుందనీ వాదించాడు.

ప్రభుత్వం 2008 మార్చి నెలలో రస్ అల్‌ఖైమాతో అవగాహన ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం మూడు నెలలలోగా వివరమైన ప్రాజెక్టు రిపోర్టు, ఆర్థికంగా లాభసాటి అవునా కాదా అన్న నివేదిక (ఫీజిబిలిటీ రిపోర్టు) రస్ అల్‌ఖైమా అందజేయాలి. నిజంగా ప్రజల జీవితాలలో అభివృద్ధి తీసుకువచ్చే ప్రాజెక్టే అయితే, బయటపెట్టి, అదెలా అభివృద్ధిని తీసుకువస్తాయో వివరించవచ్చు. ఆ నివేదికలు యిప్పటికీ అందయా లేదా అన్న విషయం కూడా బయటకు పొక్కనివ్వరు. ఈనాటికే అంది వుండాలి. కానీ మంత్రి ఇంకా అర్నెల్లు పడుతుందన్నారని వార్తలు సెప్టెంబరు నెలలో వచ్చాయి. వివరమైన ప్రాజెక్టు నివేదిక. ఆర్థిక నివేదిక లేకుండానే అభివృద్ధి వస్తుందని ఎలా అంటున్నారు? ఏంఓయులో ఫిష్ లాండింగుల ప్రసక్తే లేదు. రేవులు, నౌకా నిర్మాణకేంద్రం గురించే వుంది.

వాన్‌పిక్ కోసం అవసరమైన సాంకేతికత, ఆర్థిక స్థోమత వున్న ఏ విదేశీ సంస్థనైనా భాగస్వామిగా చేసుకునేందుకు రస్ అల్‌ఖైమాకు స్వేచ్ఛనిచ్చారు. మాట్రిక్స్ ఎన్‌పోర్టు అన్న కంపెనీ ఇందులో భారత్ భాగస్వామి. విశాఖలో ప్రైవేటు కంపెనీల బాక్సైటు తవ్వకాలు చెల్లవన్న సుప్రీంకోర్టు తీర్పును వమ్ము చేయటానికి ప్రభుత్వ రంగ సంస్థే తవ్వుతున్నట్లు చూపి, రస్‌అల్‌ఖైమాకు ఇచ్చారు. బాక్సైట్, అల్యూమినియం రంగంలో రస్‌అల్‌ఖైమా లేదు. దీనిని శిఖండిగా పెట్టుకుని స్టెరిలైట్ కంపెనీ తవ్వకాలను చేపట్టింది. వాన్‌పిక్‌లో కూడా విదేశీ భాగస్వామిని అంగీకరించారు. రస్ అల్ ఖైమా వెనకనున్న సామ్రాజ్యవాద శక్తులెవరు? వారే పరిశ్రమలు పెట్టడానికి తయారవుతున్నారు? ఇవి కీలకమైన ప్రశ్నలు. తలసిరెడ్డిగారంటున్న అభివృద్ధి ఎవరికి వుపయోగపడుతుంతో ఇది తెలుపుతుంది. పోర్టు ఆధారిత కారిడార్ అనటం, ఎంఓయులోని అంశాలు గమనంలో వుంచుకుంటే, ఇక్కడ నెలకొల్పే పరిశ్రమలు మన దేశ వనరులనుపయోగించుకుని (విద్యుత్తు, నీరు, ద్రవ్యం ఖనిజాలు) ఉత్పత్తి చేసి ఎగుమతి చేస్తాయి. ప్రధానంగా రసాయన పరిశ్రమలు. దేశీయ వనరులు విదేశీ కంపెనీల లాభాలకు వాడబడతాయి. మనకు మిగిలేది ప్రమాదకర కాలుష్యమూ, జీవనోపాధి మృగ్యమైన జీవనాలే. ఇవి ఉత్త భయాలు మాత్రమేననీ, రాజకీయ లబ్ధికోసం ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయనీ ప్రభుత్వం అనుకుంటే, ప్రాజెక్టు నివేదికలను విడుదలచేసి, ఆ భయాలను తొలగించవచ్చు. కానీ అలా చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ ప్రజలను నిందించటానికి సిద్ధపడటమంటే ప్రజల భయాందోళనలు నిరాధారం కావన్నది సుస్పష్టమౌతున్నది.

ఎన్నికలు దగ్గర పడటంతో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఎక్కడలేని హడావుడే చేస్తున్నాడు. ప్రపంచబ్యాంకు సిఇఓగా గుర్తింపు పొందానని మురిసిపోయిన ఆయన సంగతి ప్రజల మరచిపోలేదు. అయినా తానధికారంలో వుండగా ఎద్దేవా చేసిన వాగ్దానాలనే తానే చేస్తానంటూ ఆశల పందిళ్లు వేస్తున్నాడు. తానధికారంలోకి వస్తే కోస్తలు కారిడార్‌ను కాకినాడ సెజ్‌ను రద్దు చేస్తామని ప్రకటించాడు. అభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించేలా ఈ ప్రాజెక్టులను రూపొందిస్తానంటున్నాడు. కొత్తగా ఏర్పడిన ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి సెజ్‌లలో రైతాంగానికి భాగస్వామ్యం యివ్వాలనీ ప్రకటించాడు.

టిడిపి సూత్రరీత్యా సెజ్‌లు, కోస్తలు కారిడార్‌ల నిర్మాణాన్ని వ్యతిరేకించటం లేదు. రైతాంగవద్ద చౌకగా లాక్కుని, ఎక్కువ ధరకు అమ్మి కాంగ్రెసు నాయకులు లబ్ధి పొందుతున్నారన్నదే ఆయన విమర్శ. స్థూలంగా కాంగ్రెసు నాయకుల అవినీతి గురించే ఆయన విమర్శ అంతా. రైతాంగానికి లక్ష యిచ్చి పది లక్షల కమ్ముకుంటున్నారు గనుక ఆ పది లక్షలల్లో రైతాంగానికి వాటా యివ్వాలన్నదే ఆయన వాదన. దానినే రైతులకు భాగస్వామ్యం కల్పించాలంటున్నాడు. సెజ్‌లకు అనుమతినిచ్చేది కేంద్రం దానిని రద్దు చేయాల్సింది కేంద్రమే. తనోకవేళ మళ్ళీ గద్దెనెక్కినా తన అధికార పరిధిలోలేని చర్యలు తీసుకుంటాననటం గాలికిపోయే పేలపిండి కృష్ణార్పణమన్న చందంగా వుంటుంది. ప్రజలను పిచ్చివాళ్లుగా పరిగణించే వైఖరి తప్ప మరేమీ కాదు.

ప్రజలు కోస్తలు కారిడార్‌ను వ్యతిరేకిస్తున్నది తమకు మంచి రేటు రాలేదని కాదు. భూములు వదులుకోవడటమంటే తమ జీవనోపాధి వదులుకొని నిరాధారంగా నిలబడవలసి వస్తుంది కనుక వారు వ్యతిరేకిస్తున్నారు. పాలకులు చెప్పే అభివృద్ధి ఏదీ నిర్వాసితులకు ఉపాధి కల్పించదన్న 60 ఏళ్ల పాలన కఠోర అనుభవం వారి ముందున్నది గనుక వ్యతిరేకిస్తున్నారు. భాగస్వామ్యం కల్పిస్తామన్న ఆడంబర పదజాలంతో రైతాంగానికి ఎక్కువ డబ్బు అందుతుందన్న ఆశ చూపి వారిని భూములు వదులుకునేలా అంగీకరింపచేయలన్న మోసం తప్ప మరేమీ కాదు.

వాస్తవాలు గమనించినా ఇది తేలికగా అర్థమౌతుంది. వాన్‌పిక్‌ను నిర్మించేది రస్ అల్ ఖైమానూ, దాని భారత్ భాగస్వామి మాట్రిక్స్ ఎనఎపోర్టు, మిగిలినవారు విదేశీ భాగస్వాములే, వారెవరో రస్ అల్ ఖైమా నిర్ణయించుకుంటుంది. ప్రభుత్వం దేశంలో వున్న చట్టాల ప్రకారం (భూ సేకరణ చట్టం) భూములు వారికిస్తుంది; నిర్మాణానికి అవసరమైన పర్యావరణ కాలుష్యం తదితర అనుమతులు, పరిశ్రమలకు లైసెన్సులూ యిస్తుంది. రస్ అల్ ఖైమా అంగీకరించకుండా ఒప్పందంలో ఎలాంటి మార్పులు చెయ్యరు. ఇదీ జరిగిన ఒప్పందం. ఇక నిర్వాసితులయ్యే రైతులకు భాగస్వామ్యమిచ్చే అవకాశమెక్కడుంది. ప్రజల ప్రతిఘటనపై నీళ్లు చల్లేందుకు ఒప్పుకున్నా, వారిచ్చేది వాన్‌పిక్ కంపెనీలో షేర్లు మాత్రమే. నిర్మాణాలు పూర్తయి, ఎగుమతి, దిగుమతులు సాగి ఆ కంపెనీకి లాభాలు రావటనికి కనీసం 15 ఏళ్లు పడుతుంది. భూములప్పగించి కంపెనీకెప్పుడు లాభలోస్తాయనుకుంటూ రైతాంగం ఎదురుచూస్తూ కూర్చోవాలి. బడా బూర్జువా వర్గం అనేక వక్రమార్గాల్లో చిన్న షేరు హోల్డర్ల ఆదాయాన్ని మింగివేసే విషయం బహిరంగ రహస్యమే. రైతాంగానికిస్తే గిస్తే ఈ షేర్లు సర్టిఫికేట్లు నాలుక గీసుకోవటానికి కూడా పనికిరావు. భాగస్వామ్యమన్న ఆడంబరపు నినాదమాని, ఇంకే రూపంలో రైతాంగానికి భాగస్వామ్యం కల్పిస్తారో స్పష్టం చేయకపోతే, అది ప్రజలకు ఆశలు చూపి మోసగించే విధానమే అవుతుంది.

పారిశ్రామికీకరణ లేకుండా అభివృద్ధి రాదు; పరిశ్రమలకు భూమి కావాలి; కనుక నిర్వాసితులకు న్యాయం చెయ్యమనాలిగానీ అసలు పారిశ్రామికీకరణనే వ్యతిరేకించటం అభివృద్ధిని ఆటంకపరచటమని ప్రభుత్వ వర్గాలే కాక మరికొందరు కూడా వాదిస్తున్నారు. పారిశ్రామికీకరణ జరగరాదని ఎవరూ అనటం లేదు. ఆ పారిశ్రామికీకరణ ఎవరి కోసం, ఏ విధంగా జరగాలన్నదే చర్చ.

సామ్రాజ్యవాదులు సహాయం పేరిట రుణాలనిచ్చి పారిశ్రామిక విధానాన్ని నిర్దేశిస్తున్నారు. ఈ రుణాల ఉచ్చులో కూరుకుపోయిన భారత పాలకులు రుణాలను తిరిగి తీర్చాలంటే ఎగుమతులను పెంచి, విదేశీ మారక ద్రవ్య మార్జించాలన్న ప్రపంచబ్యాంకు సూచనలనే అమలు జరుపుతున్నారు. దీనినే ఎగుమతి ఆధారిత అభివృద్ధి వ్యూహంగా పిలుస్తున్నారు. దీనిలో దేశ ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలు నిర్మించరు. విదేశీ మార్కెట్లు అమ్ముడయ్యే సరుకుల ఉత్పత్తి కోసమే పరిశ్రమలు పెడతారు. అవి కూడా విదేశీ కంపెనీలే పెడతాయి. ప్రజల అవసరాలు తీర్చకపోయినా, రాయితీల పేరుతో ప్రజాధనాన్ని వారికి ధారపోస్తారు. నూతన ఆర్థిక విధానాల సారాంశమంతా యిదే.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

రైలు ప్రమాదాలు లాభార్జనకు ప్రయాణీకుల ప్రాణాలు బలి

గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదానికి ప్రయాణీకులు నిలువునా దగ్ధమై పోయిన ఘోర దురంతం జరిగి నెల రోజులు తిరగకుండానే పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. వారంలోపే ఖైరతాబాద్‌లో ఆగివున్న రైలును వరంగల్లు ప్యాసింజరు వెనుక నుండి గుద్దిన ఘటన జరిగింది. పలు ప్రయాణీకుల రైళ్లలో పొగలు వచ్చి ప్రయాణీకులు పరుగులుపెట్టిన ఘటనలు వారానికొకటి విన్పిస్తూనే వున్నాయి. లైన్‌మాన్ అప్రమత్తత వల్ల విరిగిన పట్టాలు చూసి సరిచేయటంతో ఘోరప్రమాదం తప్పిపోయిందన్న వార్తలు తరచుగా వస్తున్నాయి. గూడ్సు రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు దినపత్రికల్లో ఒక మూలన కన్పిస్తున్నాయి. అనేక చిన్న ప్రమాదాలకు సంచలన స్వభావం లేనందున వార్తల్లోకెక్కలేకపోతున్నాయి. రైల్వేలలో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నది నిర్వివాదమైన అంశమేకానీ వాటికి కారణాలేమిటన్నది మాత్రం వెలుగులోకి రావటం లేదు.

ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్తు షార్టు సర్క్యూటు అనీ, సిబ్బంది నిర్లక్ష్యమనీ తక్షణ కారణాలను చూపుతూ, అరాచక శక్తుల లేదా తీవ్రవాదుల చర్య అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తామంటూ, వార్తకు సంచలనాన్ని అద్ది అసలు కారణం పూర్తి విచారణ తర్వాతే తెలుస్తుందంటూ ముక్తాయింపు యివ్వటం రైల్వే ఉన్నతాధికారులకూ, మంత్రులకు పరిపాటి అయింది. ఆ విధంగా ముందుగానే ఒక అభిప్రాయాన్ని వ్యాప్తిచేసి మూలకారణాల నుండి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు. చట్ట విహితమైన రైల్వే సేఫ్టీ కమీషనర్ ఆధ్వర్యంలో ప్రమాదాలపై విచారణ సాగుతున్నదిగానీ, వారందజేసిన నివేదికల నిర్ధారణలూ, నివారణా సూచనలేమిటో ఎక్కడా ప్రజలకందుబాటులో వుండటం లేదు. ఇటీవల కాలంలో నివేదికలను ప్రజా ప్రాతినిధ్య సంస్థలకు కూడా అందజేయని పరిస్థితి కన్పిస్తున్నది. ఈ నివేదికల అమలుకు తీసుకున్న చర్యలేమిటో పాలకులకే తెలుసు. ప్రజలకు తెలిసింది మాత్రం రైల్వే భద్రతా చర్యలపేరిట టిక్కెట్టు ఛార్జీపై విధించిన సర్‌ఛార్జీ రూపేణా తమపై సాలీనా రూ.600 కోట్ల అదనపు భారం పడినా ప్రమాదాలు పెరుగుతున్నాయని.

ఈ ప్రమాదాలకు తక్షణ కారణాలను పేర్కొంటున్నారు. విద్యుత్తు షార్టు సర్క్యూట్, బ్రేకులు పట్టివేసి రాపిడికి పొగలు రావటం వంటి కారణాలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. తరచుగా ఒకే తరహా ప్రమాదాలు పునరావృతమవుతున్నాయంటే కారణాలు మర్వింత లోతుగా వుండి వుంటాయన్న వాస్తవాన్ని దాట వేస్తున్నారు. ఉదా: చెన్నై, కలకత్తాల మధ్య కోరమాండల్, మెయిలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లుగా ప్రతిరోజు నడుస్తాయి. 24 పెట్టెలు గల రేక్‌లు నాలుగు ఒక్కోదానికీ అవసరం. గతంలో చెన్నైలో బయలుదేరి 30 గంటలు ప్రయాణించి కలకత్తా చేరేవి. దాదాపు 12 గంటలు అక్కడ ఆగి తిరిగి బయలుదేరి చెన్నై చేరేవి. ఇక్కడ తిరిగి బయలుదేరటానికి 12 గంటలు సమయం వుండేది. రెండు గమ్యాల వద్దా 12 గంటల సమయముండటంతో అన్ని రైల్వే విభాగాల సిబ్బందీ బండిని పరీక్షించి, తగిన ఏర్పాటు చేసి ప్రయాణానికి సన్నద్ధం చేసేవారు. గత ఏడాది నుండీ ఈ పద్ధతిని మార్చారు. ఉదయం నాలుగు గంటలకు చెన్నై చేరిన మెయిలు బండిని, కోరమాండల్ బండిగా ఉదయం పదిన్నరకు కలకత్తా పంపుతున్నారు. ప్రయాణీకులు దిగటానికీ, మళ్లీ ఎక్కడానికీ, సైడింగులోకి తీసుకువెళ్లి మళ్లీ పంపటానికీ ఒక గంట పట్టిందనుకున్నా, బండిని పరీక్షించేందుకు సిబ్బందికి వుండేది ఐదున్నర గంటలే. వచ్చే బండి ఆలశ్యమైతే ఈ సమయం ఇంకా తగ్గిపోతుంది. అలాగే సాయంత్రం 5 గంటలకు చెన్నై చేరే కోరమాండల్ బండిని రాత్రి పదిన్నరకు మెయిలు బండిగా పంపుతున్నారు. అటు హౌరా స్టేషనులోనూ ఈ రెండు బండ్లనూ ఇలాగే మార్చి మార్చి నడుపుతున్నారు. ఫలితంగా చెన్నై, హౌరాలలో బండి పరీక్షించే సమయం 12 గంటల నుండి 4 గంటలకు తగ్గిపోయింది. ఫలితంగా బండిని పూర్తిగా, క్షుణ్ణంగా పరీక్షించలేక, కొన్ని లోపాలు బయటపడినా మరమ్మత్తుకు సమయంలేక, తాత్కాలికంగా ఏదో అతుకువేసి బండిని ప్రయాణానికి సిద్ధంచేసి పంపుతున్నారు. ఈ మార్పే ప్రమాదాలు పెరగటానికి కారణం. ఇలా రెండు బండ్లను మార్చి నడపటంవల్ల 8 రేక్‌ల బదులు 7 రేక్‌లు సరిపోవటంతో, మిగిలిన ఒక రేక్‌తో మరో బండిని నడుపుతున్నారు. ఇది ఒకటో రెండో బండ్ల విషయంలో జరిగింది కాదు. విజయవాడ, సికింద్రాబాదు వంటి జంక్షనులో నిలబడి వచ్చేపోయే బండ్లలోని పెట్టెల మీద పేర్లను గమనిస్తే, మెయింటినెన్సు సమయాన్ని తగ్గించివేస్తూ, రెండు రకాల బండ్లుగా ప్రతి ట్రెయిను రేక్‌ను నడుపుతున్నారని తెలుస్తుంది. దీనికి తోడు గత దశాబ్ద కాలంగా రైల్వేలో సిబ్బంది సంఖ్యను తగ్గించటంతో కూడా మెయింటినెన్సు పనులు మూలన పడుతున్నాయి. రైల్వేలకు మాత్రం ఆదాయం పెరుగుతున్నది.

ఆదాయం పెంచుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే బోర్డు మెయింటినెన్సును నిర్లక్ష్యం చేస్తున్నందువల్లనే ప్రమాదాలు పెరుగుతున్నాయనటానికి మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. ఒంగోలు-నెల్లూరుల మధ్య పట్టాలు విరిగిన, గూడ్సు పట్టాలు తప్పిన ఘటనలు తరచుగా సాగుతున్నాయి. అనుమతించిన బరువు కన్నా రెట్టింపు వరకూ బరువైన గ్రానైట్ గూడ్సు పెట్టెలో వేయటం వల్ల ట్రాకు దెబ్బతింటున్నదని రైల్వే అధికారులందరికీ తెలుసు. అయినా ఆదాయం పెరుగుతోంది గనుక చూడనట్లు నటిస్తున్నారు. దీనికితోడు రైలుపట్టాల కొనుగోలును స్టీలు ఫ్యాక్టరీల నుండీ కాకుండా, టెండర్లను పిలిచి కొనుగోలు చేయటంలో (ప్రైవేటీకరణ చర్యల్లో భాగంగా) నాసి నాణ్యత గల పట్టాలు బరువు తట్టుకోలేక విరిగిపోతున్నాయి. పట్టాల క్రింద కంకరరాళ్లు పేర్చటం మొదలగు పనులన్నీ రైల్వే ఇంజనీర్ల పర్యవేక్షణలో కళాసీలు చేసేవారు. ప్రైవేటీకరణ పేరుతో వీటిని కాంట్రాక్టుకివ్వటంతో పనులు నాణ్యత లేక రైలుమార్గాలు బలహీన పడుతున్నాయి. ఫలితంగా ప్రమాదాల సంఖ్య పెరుగు తున్నది.

(తరువాయి 2వ పేజీలో)

పత్రికా ప్రకటన:

భైంసా ఘటనలు-కార్మిక శక్తుల కర్తవ్యం

10.10.2008న భైంసా పట్టణంలోనూ, ఆ తరువాత చుట్టుపక్కల గ్రామాలలో మతపరదాడులు, ఘర్షణలు, పోలీసు కాల్పులు, దహనాలు జరిగిన ప్రాంతాలను సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కె.కోటయ్య నాయకత్వాన ఒక పరిశీలనాబృందం పర్యటించింది. ఈ బృందంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ గంగుల నర్సయ్య, నాందేడ్‌జిల్లా కిసాన్ మజ్దూర్ సభ నాయకులు కా॥ బాబూరావు, కుంభర్‌గావ్, లక్ష్మణరావు సాంటక్కిలు సభ్యులు. ఈ బృందం 16.10.2008న భైంసా పట్టణంలోని సంజేహ మసీద్ సదర్ జనాబ్ అహమ్మద్ హుస్సేన్ అబుల్ జబ్బార్, ఉపసదర్ సయ్యద్ యాసిన్‌సాబ్‌లను, బాధిత కుటుంబాలను, ఘర్షణలో మరణించిన రాజీవ్‌నగర్ నివాసి ఎన్నార్ భూటన్ అలియాస్ బూటాసింగ్-భార్యను, కుటుంబసభ్యులను పరామర్శించింది. అనంతరం వటోలి గ్రామానికివెళ్లి ఉపసర్పంచ్ జారల్ జగత్‌రావ్‌ని, ఇతర గ్రామ పెద్దలను కలిసింది. హత్యకు గురైన మహబూబ్‌ఖాన్ ఇంటి పరిసరాలను పరిశీలించింది. అదే విధంగా భైంసా మండలానికి చెందిన వాలేగాం గ్రామంలో కూల్చివేయబడిన మసీదును, పరిసర ప్రాంతాలను పరిశీలించింది.

ఘటనల క్రమాన్ని అర్థం చేసుకొంటూ తన పరిశీలనాంశాలను సంక్షిప్తరూపంలో ప్రాథమికంగా ఈ ప్రకటన రూపంలో విడుదల చేస్తున్నాం.

1. 10.10.2008న పోలీసు కాల్పులలో మరణించిన అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ సమీల కుటుంబసభ్యులకు, అమానుషంగా హత్య చేయబడిన ముక్కుపచ్చలారని చిన్నారులు, పెద్దలతోసహా దహనం చేయబడిన వటోలి గ్రామం మహబూబ్ ఖాన్ కుటుంబంలో మిగిలిన సభ్యులకు, భైంసాలో ఘర్షణలో చనిపోయిన ఎన్నార్ భూటన్ కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాం.

మతతత్వశక్తులకు మతం లేదు. వారు పెట్టిన మంటలకూ మతంలేదు. కనుక 10.10.2008న ఇళ్ళు, దుకాణాలు తగులబెట్టబడి తీవ్రంగా నష్టపోయిన ముస్లిం, హిందూ చిన్న వ్యాపారులందరికీ మా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం.

మొత్తం ఘటనలపై సమగ్ర విచారణ జరిపి ఘటనలలో పాల్గొన్న వారికన్నా వారిని ప్రేరేపించిన వారిని గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని వారి ఆస్తులను స్వాధీన పర్చుకొని బాధితులకు పంపకం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

2. గత వారం రోజులుగా ప్రభుత్వం అమలుచేస్తున్న కర్ఫ్యూ మూలంగా రెక్కాడితే గానీ డొక్కాడని కష్టజీవులు, పత్తి, వరి పంటకొస్తున్న సమయంలో సస్యరక్షణ చేసుకోవాల్సిన రైతులు, రైతుకూలీలు, మహిళలు, పశువులకు గ్రాసం దొరకక, మనుషులకు ఆహారం దొరకక పిల్లలకు పాలు తదితర అవసరాలు నెరవేరక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ ఆహార పదార్థాలు ఉచితంగా అందించడంతోపాటు పగటిపూట కర్ఫ్యూను సడలించాలని కోరుతున్నాం.

3. గ్రామాలలో మతతత్వశక్తులు చేస్తున్న దుష్ప్రచారాలు. పుకార్లకి భయపడి మహిళలు వ్యవసాయ పనులకి వెళ్ళేందుకు జంకుతున్నారు. గ్రామ గ్రామాన ప్రజలు అన్ని మతాల, కులాల ప్రజలు సమావేశమై శాంతి కమిటీలను ఏర్పరచుకొని మతోన్మాదశక్తుల నుండి గ్రామీణ జన జీవితాన్ని కాపాడుకొనేందుకు తరతరాలుగా పాదుకొని ఉన్న లౌకిక విలువలను పరిరక్షించుకొనేందుకు ప్రజలే పూనుకోవాలని పిలుపు ఇస్తున్నాం.

ప్రభుత్వాధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజలలోని ముఖ్యంగా మైనార్టీ మతస్తులలోని భయాందోళనలను పారద్రోలాలని, గ్రామీణ ప్రజలకి అవసరమైన ఎరువులు, పురుగుమందులు వెంటనే సరఫరాచేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

4. ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్‌జిల్లాలు చాలా కాలంగా మతతత్వశక్తుల- ముఖ్యంగా హిందూ మతతత్వ శక్తుల ప్రయోగశాలగా ఉన్నాయి. ఇటీవల అల్లర్లు కాకతాళీయంగా జరిగిన ఘటనలు కావు. ఒక పథకం ప్రకారం జరిగినవి. దేశవ్యాపితంగా మతతత్వశక్తులు రాజకీయ ఆధిపత్యం కోసం అమలుచేస్తున్న దుష్ట పథకాలలో భైంసా ఘటనలు ఒక భాగం మాత్రమే.

వాలేగాం మసీదు కూల్చివేత, వటోలి, మహబూబ్‌ఖాన్ కుటుంబం కాల్చివేతలు గ్రామాలను మతప్రాతిపదికగా పునర్ వ్యవస్థీకరించడంకోసం, భయోత్పాతాన్ని సాధనంగా అమలుచేసిన ఎజెండాలోని అంశాలుగానే చూడాలి.

దీని అంతటిని సమగ్రంగా అర్థం చేసుకొని ప్రజాతంత్ర, లౌకిక, మానవతా శక్తులందరూ మతతత్వశక్తులు విసురుతున్న సవాలును స్వీకరించి జన జీవితాన్ని లౌకికంగానూ, ప్రజాతంత్రయుతంగా మలచేందుకు లోతైన పోరాటానికి నడుం బిగించాలని కోరుతున్నాం.

5. 1992-96 మతఘర్షణల దృష్ట్యాను, ఇటీవల టీ.వీ.లలో మహిషాసురమర్ధిని భైంసాలోనే పుట్టిందని, ఆమె పాదముద్రలు ఉన్నాయని, మహిషాసురమర్ధిని పేరు మీదనే భైంసా ఏర్పడిందని జరుగుతున్న ప్రచారాలని గమనించైనా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండవలసింది. సమస్యాత్మక ప్రాంతం అయిన భైంసాలోను అంతకంటే సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల పరిస్థితిని చక్కదిద్దేందుకు పూనుకోని ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఖండిస్తున్నాం.

అదే సమయంలో ప్రాధాన్యత గల అంశం ఏమంటే ఏ మతానికి చెందిన మతతత్వశక్తులైనా ఎంత రెచ్చగొట్టినా (10వ తేదీన దుండగుల దౌర్జన్యాలు, ఛాటుమాటు పిరికి దాడులు తప్ప) ప్రజలు మతతత్వవాదుల కుట్రలకు లొంగకపోగా, ఇళ్ళు కాలిపోతున్న సమయంలో ముస్లిం కుటుంబాలను హిందూ కుటుంబాలు ఆదుకొన్నాయి. ఇంత విజ్ఞత ప్రదర్శించిన ప్రజలకి జేజేలు తెలుపుతున్నాం.

6. ప్రపంచవ్యాపితంగా అమెరికా గూఢచారి సంస్థ సి.ఐ.ఏ. వివిధ మతాలు అనగా మెజారిటీ, మైనారిటీ మతాలలో మతతత్వాన్ని ప్రోత్సహించుతూ తన సామ్రాజ్యవాద దోపిడీ ప్రయోజనాలకోసం మలచుకొంటున్నది. కనుక మతతత్వ రాజకీయాలను ఖండిస్తూ మన ప్రజల ఉజ్వలమైన గత చరిత్రను, వర్తమాన సమస్యలను అర్థం చేసుకొంటూ లౌకిక, ప్రజాస్వామిక మార్పుకోసం సాగాలని కోరుతున్నాం.

17.10.2008

కె.కోటయ్య
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ, సి.పి.ఐ.(ఎం.ఎల్)

కామ్రేడ్ కూరాకుల తిరుపతిరావుకు జోహార్లు!

పార్టీ సానుభూతిపరుడు కా॥ కూరాకుల తిరుపతిరావు 12.10.2008 సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వయసు 60 సం.లు. వారి కుటుంబసభ్యులకు జనశక్తి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. శ్రీకాకుళంజిల్లా నుండి వలస వచ్చి తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న కా॥ తిరుపతిరావు యువజన సంఘంలో చురుకుగా పనిచేశారు. గిరిపురం ఇళ్ల నిర్మాణంలో, ఆ శ్రామికవాడను నిలబెట్టడంలో సాగిన ఉద్యమంలో చురుకుగా పాలుపంచుకున్నారు.

కా॥ తిరుపతిరావుకు జోహార్లు తెలుపుతూ, వారి కుటుంబసభ్యుల.విచారంలో పాలు పంచుకుంటూ సి.పి.ఐ. (ఎం.ఎల్) విజయవాడ నగర నాయకులు 13.10.2008న సాగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సంతాప సభలో కె.ఏసు, మీసాల వెంకట్రావు, వీరబాబు ఆయన చేసిన కృషిని ప్రస్తావించి జోహార్లు తెలిపారు.

జన్యుమార్పిడి ఆహార పంటలను వద్దంటున్న అమెరికా రైతాంగం

జన్యుమార్పిడి పంటలకు మన దేశంలో తలుపులు తెరవకపోతే, మనం అభివృద్ధి చెందుతున్న సాంకేతికత విషయంలో వెనుకబడిపోతామనీ, ప్రపంచ మార్కెట్టులో పోటీ చేయగలిగే స్థానంలో మనం వుండమనీ పదే, పదే భారత పాలకులూ, భారతదేశపు బయోటెక్నాలజీ డిపార్టుమెంటు అధికారులూ చేసే ప్రకటనలు ప్రపంచంలోని ప్రముఖ మాలిక్యులర్ బయోలజిస్టు డా॥ జాన్‌ఫెగన్ దిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తూ, భారతదేశ పాలకులూ, అధికారులూ చెప్తున్నట్టు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో జన్యుమార్పిడి పంటలు వేయటం అన్నది జరగటల్లేదనీ, ఆ దేశాల్లో జన్యుమార్పిడి పంటలపట్ల రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారని తెలియచేస్తున్నారు.

ప్రపంచంలో వున్న శాస్త్రజ్ఞులు జన్యుమార్పిడి సాంకేతికతను కాలం చెల్లిన, జటిలమైన, వ్యర్థమైన సాంకేతికతగా పరిగణిస్తున్నారనీ, ఈ జన్యుమార్పిడి పంటల వల్ల మానవుల ఆరోగ్యానికీ, పశువుల ఆరోగ్యానికీ, పర్యావరణానికీ తీవ్రమయిన హాని వాటిల్లుతోందని ఆయన తెలియచేశారు.

1998లో అమెరికా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను యూరోపులో అమ్ముతూ వుండగా, 1999లో జన్యుమార్పిడి మొక్కజొన్న పంటలను ప్రారంభించటంతో ఆ దేశం యొక్క ఎగుమతులు 1,39,000 మెట్రిక్ టన్నులకు పడిపోయిందనీ, అదే విధంగా సోయాబీన్సు ఎగుమతి వ్యాపారం 1997లో 207 మిలియన్ల డాలర్ల మేరకు వుండగా, 1999లో జన్యుమార్పిడి వలన అది కేవలం 56 మిలియన్ల డాలర్లకు పడిపోయిందనీ ఈ రకంగా జన్యుమార్పిడి పంటల వలన అమెరికా యొక్క విదేశీ ఎగుమతి వ్యాపారం దెబ్బతిందనీ, ప్రత్తి విషయంలో కూడా యిలాగే జరిగిందనీ ఆయన తెలియపరిచారు.

ఆ రకంగా జన్యుమార్పిడి సాంకేతిక వ్యాపారంలో విజయాన్ని సాధించటంలో వైఫల్యం చెందిన బహుళజాతి విత్తన సంస్థలు గతంలో పురుగుల మందుల విషయంలో చేసినట్లుగానే, ఈ జన్యుమార్పిడి సాంకేతికతను అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందని దేశాల్లో కుమ్మరించి లాభాలు చేసుకొంటున్నాయని ఆయన తెలిపారు.

అమెరికన్ రైతులు జన్యుమార్పిడి గోధుమ, వరి విత్తనాలను నిరాకరిస్తున్నారనీ, జన్యుమార్పిడి పంటల వల్ల తమ ఎగుమతి వ్యాపారం దెబ్బతింటుందని వారు భావిస్తున్నారనీ ఆయన పేర్కొన్నారు.

2006 సంవత్సరంలో ఒక జన్యుమార్పిడి వరి విత్తన ప్రయోగం మొత్తం వరి పంటనే విషపూరితంగా కలుషితం చేసిందనీ, దాంతో అమెరికన్ ప్రభుత్వం 1.5 బిలియన్ల డాలర్ల మొత్తాన్ని వెచ్చించి ఆ కాలుష్యాన్ని శుద్ధి చేయవలసి వచ్చిందనీ ఆయన తెలియచేశారు.

నవధాన్య, ఇసిస్, ఇఫోమ్ సంస్థలు సంయుక్తంగా ఢిల్లీలో అక్టోబరు 2వ తేదీన జరిగిన "భవిష్యత్తులో ఆహారం: వాతావరణ మార్పు, జన్యుమార్పిడి ఆహారం-ఆహారభద్రత" అన్న అంశంపై నిర్వహించిన మహాసభలో ప్రముఖ శాస్త్రవేత్త డా॥ జాన్‌ఫెగన్ ఈ వివరాలను వెల్లడించటం జరిగింది.

ఈ రకంగా జన్యుమార్పిడి పంటల వల్ల జరిగే హాని గురించీ, వాటిపట్ల సంపన్నదేశాల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకత గురించీ, శాస్త్రజ్ఞుల అభిప్రాయాల గురించీ తెల్సున్నా భారత పాలకులు మాత్రం యీ వాస్తవాలను పట్టించుకోకుండా, సంభవించబోయే హాని గురించి పట్టించుకోకుండా, దేశంలో "వరి" (జన్యుమార్పిడి) విత్తనాల క్షేత్ర ప్రయోగాలను పూర్తి చేయించేశారు. తొందరలో ఈ జన్యుమార్పిడి ఆహార పంటలను మార్కెట్లలో ప్రవేశపెట్టింప చేసేందుకు తొందర పడుతున్నారు. ఈ రకంగా వీరు దేశ ప్రజలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

చైతన్యవంతమయిన ప్రజల ఉద్యమం ద్వారా ఈ దుర్మార్గాన్ని నిలువరించాల్సి వుంది. ◈

కోస్టల్ కారిడార్... (1వ పేజీ తరువాయి)

గత రెండు దశాబ్దాలుగా అమలు జరిగిన ఈ వ్యూహం సాధించిందేమిటి? ఎగుమతులు పెరిగాయి. దానికోసం దిగుమతులు పెరిగాయి. వెరసి విదేశీ వాణిజ్యంలో లోటు ఏడాదికేడాది పెరిగిపోతూనే వుంది. ఫలితంగా పాలకులు చెప్పిన విదేశీ మారక ద్రవ్య ఆర్జనలో మిగిలిందేమీ లేకపోగా లోటే వుంది. అయినా విదేశీ మారక ద్రవ్య నిలువలు పెరిగాయి. ఎలా? విదేశాల్లో పని చేస్తున్న భారత కార్మికులు తమ కడుపు కట్టుకుని తమ కుటుంబాలకు పంపుతున్న సంపాదనవల్ల. ఇక్కడే అసలు విషయం తెలుస్తుంది. భారత్‌కున్న శక్తి దానికున్న విస్తృత సహజ వనరులూ, అపార మానవ శ్రమశక్తి. ఈ రెంటినీ వినియోగించుకుని పరిశ్రమల స్థాపన జరిగితే దేశ సంపద, ప్రజల ఆదాయం పెరుగుతాయి. విదేశీ పెట్టుబడులూ, వారి పరిశ్రమలుకానీ, ఎప్పుడు అదృశ్యమౌతుందో తెలియని విదేశీ మార్కెట్లుగానీ దీనిని సాధించలేవనీ మన అనుభవమే తెలుపుతున్నది.

జపాను, తైవాను, కొరియా, తదితర దేశాలు ఎగుమతులతో లబ్ది పొందాయి. కదా అనవచ్చు. చిన్న దేశాలుగా, వనరుల కొరత వున్న ఈ దేశాలు తమకు తగిన వ్యూహాన్ని ఎంచుకున్నారు. టివిని కన్నుక్కుని, తయారుచేసిందీ అమెరికాలోనే. అయితే ఈటివి తదితర ఎలక్ట్రానిక్ పరికరాల పేరు చెపితే మొదట గుర్తువచ్చేది జపాను. అత్యధిక స్థాయిలో టీవిలను చౌకగా ఉత్పత్తి చేసే పద్ధతినవలంబించి, ప్రపంచమంతటా అమ్ముకుని, వచ్చిన ఆదాయంతో కొరతను తీర్చుకుంది. దీనినే గుడ్డిగా అనుసరించి విదేశీ కంపెనీలతో పరిశ్రమలు పెట్టించిన సింగపూర్, మలేషియాల దేశాలు పదేళ్ళ క్రితం ఎలా కుప్పకూలిపోయాయో చూశాం. ఎగుమతి చేసి-అమ్ముకోవాలంటే, ఒక వస్తువు కొనాలంటే మేడ్ ఇన్ ఇండియా ముద్ర కోసం చేసేంతగా మన స్వంత ఉత్పత్తి ఉండాలి. మన ఎగుమతుల్లో అలా ఉండేది పట్టుచీరలొక్కటే.

కనుకను దేశీ వనరులతో, దేశ ప్రజల శ్రమశక్తితో, ప్రజల అవసరాలు తీర్చటం లక్ష్యంగా పారిశ్రామికీకరణ జరగాలి. 70% జనాభా జీవిస్తున్న వ్యవసాయ రంగంతో అనుసంధానించి జరిగితే, రెంటి మధ్య సమతుల్యతతో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇవి నీతి సూత్రాలు కాదు. ఇనుప ఖనిజం ఎగుమతి చేసే బదులు ఉక్కు మిల్లు పెట్టుకుంటే కనీసం 20 వేల మందికి ఉపాధి వస్తుంది. ఖనిజ ఎగుమతికిస్తున్న రాయితీలు చాలు దీనికి పెట్టుబడి పెట్టడానికి. దేశ అవసరాలు తీరటమే కాక, అవసరమైతే ఎక్కువ ధరకు విదేశాలకు అమ్ముకోవచ్చు. అలాంటి జాతీయ, ప్రజానుకూల పారిశ్రామికీకరణ జరుగుతున్నప్పుడు, భూములు బలవంతంగా సేకరించాల్సిన అవసరమే వుండదు.

వాన్‌పిక్ పేరిట భూములను లాగివేసుకొనేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను ఎదుర్కొవటంతో పాటు వారి వంచనాత్మక వాదనాలను కూడా ప్రజలు అర్థం చేసుకోగలరు. తగిన సమాధానం చెప్పగలరు. ◈

రైలు ప్రమాదాలు ... (1వ పేజీ తరువాయి)

రెండు ఘోర ప్రమాదాలు జరగ్గానే భద్రతా చర్యలు మెరుగుపరచవలసిన ఆవశ్యకత గురించి మంత్రులే గుండెలు బాదుకుని చల్లగా సర్‌ఛార్జీ విధించారు. దాదాపు సాలీనా రూ.600 కోట్లు సర్‌ఛార్జీ ద్వారా వసూలు చేసినా, భద్రతా చర్యలకోసం వందకోట్లు కూడా రైల్వే బడ్జెట్టులో కేటాయించటం లేదు. మౌలికమైన ఈ భద్రతా చర్యలపట్ల నిర్లక్ష్యం చూపుతూనే, టెర్రరిస్టు బూచిని చూపి, జిఆర్‌పిఎఫ్ బదులు రైల్వే రక్షణ దళానికే పోలీసు అధికారాలివ్వాలన్న, దాని సంఖ్య రెట్టింపు చెయ్యాలన్న ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి.

నష్టాలలో వున్న రైల్వేలను లాభాల బాట పట్టించిన రైల్వేమంత్రి లాలూప్రసాద్ యాదవ్ గారి నుండి యాజమాన్య విజ్ఞాన పాఠాలు నేర్చుకోవటానికి హార్వర్డు యూనివర్శిటీ నుండి అధ్యాపకులు వచ్చారంటూ వార్తలు వచ్చాయి. మేనేజిమెంటు పేరిట ఎంత అందమైన పేర్లు పెట్టినా రైల్వేలు లాభాల బాట పట్టింది ప్రజలపై భారాన్ని మోపటం; కార్మికులు సిబ్బందిపై పనిభారాన్ని పెంచటం; ప్రయాణీకుల భద్రతను బలిపెట్టి పొదుపు చర్యలను అమలుజరపటం వల్లనేనన్నది స్పష్టం.

ప్రయాణీకుల ఛార్జీలు పెంచలేదంటూనే, ఎంత భారం మోపారో వివరిస్తూ "లాలూ చమత్కారాలకు మూల్యం చెల్లిస్తున్నదెవరు?" అని జనశక్తి ప్రశ్నించి, లాభార్జనకు ప్రజలపై భారాలు మోపటమేకాకుండా ప్రయాణీకుల భద్రతను కూడా బలిపెట్టారని వివరించింది. కనుకనే రైల్వే సేఫ్టీ కమీషనర్ నివేదికలను ప్రజల ముందుంచాలనీ, ప్రయాణీకుల భద్రతకు తీసుకోవలసిన చర్యలపై బహిరంగ చర్చ జరగాలనీ, వాటి అమలుకు రైల్వేలు బాధ్యత వహించాలనీ డిమాండు చేయాలి. ◈

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

నిర్మాణ కృషి

కొమిన్‌ఫాం

> "పార్టీ యొక్క బలప్రతిష్టలు-అందులోనూ ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ బలప్రతిష్టలు పార్టీ సభ్యుల యొక్క గట్టితనంపైనా, శ్రామికవర్గంపట్ల వారు చూపే శ్రద్ధాశక్తులపైనా, శ్రామికవర్గం సాగించే పోరాటంలో వారు ప్రదర్శించే పట్టుదలపైనా ఆధారపడి ఉంటాయి. అంతేకాని పార్టీసభ్యుల సంఖ్యా బాహుళ్యం మీద అంతగా ఆధారపడి ఉండవు".
>
> **స్టాలిన్**

కార్మికవర్గానికి అగ్రగామి దళాలూ, సంఘటిత సైనికదళాలూ అయిన మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు నిర్మాణ కృషిని బలపరచవలసిన ఆవశ్యకతను-ప్రాముఖ్యతను ఎల్లప్పుడూ గుర్తిస్తూనే ఉన్నాయి. నిర్మాణమూ, క్రమశిక్షణా లేకపోవడం రెండో ఇంటర్నేషనల్‌కు చెందిన సోషల్ డెమాక్రటిక్ పార్టీలకే చెల్లింది. క్రమశిక్షణ లేకపోవడం పెటీ బూర్జువా పార్టీలకొక ప్రత్యేక లక్షణం. కాని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల విషయంలో నిర్మాణమూ, క్రమశిక్షణా అత్యంతావసరం.

మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు విప్లవకర పార్టీలు. ఒక కొత్తరకం పార్టీలు. మార్క్సిజం-లెనినిజం యొక్క బలీయమైన పునాదులపై ఆ పార్టీల నిర్మాణసూత్రాలు ఆధారపడి ఉంటాయి. నిర్మాణ కృషికి సంబంధించిన పద్ధతులను అత్యంత సౌష్టవంగా తయారు చేయడానికి అవి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటాయి. ఆయా చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా వాటిని సమన్వయిస్తూ వుంటాయి. ఆనాటి రాజకీయ బాధ్యతలను సత్వరగా నిర్వహించడానికి తగినట్లుగా వాటిని తయారుచేస్తూ వుంటాయి.

పార్టీ నిబంధనావళిలో నిర్మాణ కృషికి సంబంధించిన పార్టీ సూత్రాలు పొందుపరచబడి వుంటాయి. ఏఏ పద్ధతులపై పార్టీ పనిచేయవలసి వుంటుందో, పార్టీని ఏ విధంగా నిర్మించవలసి వుంటుందో, పార్టీ ఆంతరంగిక జీవితాన్ని ఏఏ పద్ధతులపై కట్టుబాటులో ఉంచవలసి ఉంటుందో ఆ నిబంధనలు తెలియజేస్తాయి.

ప్రజాస్వామిక కేంద్రీకరణ, చైతన్యంతో కూడిన పార్టీ ఆంతరంగిక క్రమశిక్షణ, భావాల్లో కార్యాచరణలో ఐక్యతా, ముఠాలుగట్టే పద్ధతిని త్రోసిపుచ్చుట, పార్టీలో అవకాశవాదులు దూరకుండా తగు జాగ్రత్త వహించుట, ఆంతరంగిక ప్రజాస్వామ్యం మొదలైనవి పార్టీ నిర్మాణ సూత్రాల్లో అత్యంత ప్రాముఖ్యత వహిస్తున్నాయి.

ఈ ప్రధాన సూత్రాల నతిక్రమించడంగానీ, వీటిని విడనాడటంగానీ, పార్టీని బలహీనపరుస్తాయి. అందువల్ల పార్టీలు విప్లవకరమైన పోరాట పార్టీలుగా ఉండడానికి బదులు ఒంటి ఎత్తుగడల నిరంకుశ ముఠాలుగా తయారవుతాయి.

యుగోస్లావియా పార్టీ నాయకులవలంబించిన విద్రోహపూరిత విధానము ఇందుకొక చక్కటి నిదర్శనం. మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ సిద్ధాంతాన్ని తిరిగి మరమ్మత్తు చేయాలని ట్రాట్‌స్కీ పంథానే టిటో ముఠా అవలంబించింది. పార్టీ నిర్మాణ సూత్రాలను అణగద్రొక్కి వేసింది. పార్టీకి ప్రధాన పాత్ర లేకుండా చేసి క్రమంగా పార్టీని బలహీనపరచి చివరకు దాని అస్తిత్వాన్నే రద్దుచేయ పూనుకుంది. ఒకప్పుడు ట్రాట్స్కీ ముఠా చేసినట్లుగా నేడు టిటో ముఠా కూడా పార్టీలో నాయకత్వం కోసం మిలిటరీ పద్ధతులను ప్రవేశపెడుతూ ఉంది.

యుద్ధానంతర సంవత్సరాల్లో పూర్తిగా నిర్మాణ కృషినీ, రాజకీయ కృషినీ పెంపొందించడానికి కమ్యూనిస్టు పార్టీలు చాలా కృషి చేశాయి. సిద్ధాంతరీత్యా, రాజకీయరీత్యా కమ్యూనిస్టు పార్టీలు బలవత్తరమయ్యాయి. ప్రజాభిమానాన్ని చూరగొని పెద్దపెద్ద ప్రజాపార్టీలుగా అభివృద్ధి చెందాయి.

కమ్యూనిస్టు పార్టీల నిర్మాణ కృషికి రాజకీయ కృషికి సంబంధించిన ఉత్తరాలను యుగోస్లావియా కమ్యూనిస్టు పార్టీకి వ్రాయడంలోనూ, యుగోస్లావియా కమ్యూనిస్టుపార్టీ పరిస్థితిని' గురించి జూన్ నెలలో జరిగిన ఇన్‌ఫర్మేషన్ బ్యూరో తీర్మానించడం లోనూ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఒక విశిష్టపాత్రను నిర్వహించింది.

కమ్యూనిస్టు పార్టీలు తమ కృషిలోని తప్పులను దిద్దుకోడానికీ, తమ సభ్యులందరినీ సంఘటితంచేసి మంచి కట్టుదిట్టంగా ఉంచేందుకు సరియైన పంథానవలంబించడానికీ, సోషలిజానికి పునాదులు వేసేందుకు ఉపకరించే లక్ష్యాలను నిర్వచించడంలో తగినంత శక్తివంతంగా వ్యవహరించడానికీ, పల్లెల్లోనూ, పట్టణాల్లోనూ ఉన్న పెట్టుబడిదారీ శక్తులను అదుపులో ఉంచడానికీ, ఆ శక్తులను తుడిచిపెట్టడానికీ ఆ తీర్మానం తోడ్పడింది.

ఈ పై నుదహరించిన రాజకీయ కర్తవ్యాలన్నిటినీ నిర్వహించాలంటే ఆ పార్టీల నిర్మాణ కృషి యొక్క స్థాయి ఎంతో పెరగవలసి ఉంటుంది. పార్టీ నాయకత్వంలో సత్వరాభివృద్ధి రావలసి ఉంటుంది. విజయం ఎప్పుడూ తనంతట తానేరాదు. తీవ్రమైన పోరాటం ద్వారానే విజయాన్ని సాధించవలసి ఉంటుంది.

బోల్షివిక్ పార్టీ అవలంబించే ప్రధానపంథా జయప్రదం కావాలంటే నిర్మాణకృషికి ఎంతో అత్యంత ప్రాముఖ్యత వున్నదని కామ్రేడ్ స్టాలిన్ గుర్తించాడు ఈ సందర్భంలో కామ్రేడ్ స్టాలిన్ అన్నమాట లివి:

"సరియైన పంథా నిర్ణయించబడిన తర్వాత, సమస్యను పరిష్కరించడానికి సరియైన మార్గాన్ని కనిపెట్టిన తర్వాత, పార్టీ కృషి ఎంత నిర్మాణయుతంగా కొనసాగింపబడుతుంది అనే విషయంపైనా, ఆయా పరిస్థితులకు పార్టీ యొక్క పంథాను సమన్వయించడం కోసం జరిగే పోరాటం యొక్క నిర్మాణంపైనా, ఆయా స్థానాలకు తగిన వ్యక్తులను ఆయా స్థానాల్లో నియమించడంపైనా, ప్రధాన కమిటీల నిర్ణయాలు ఏ విధంగా అమలుజరుపబడుతున్నాయో వాటిని గురించి ఎప్పటికప్పుడు చేసే తనిఖీపైనా విజయం ఆధారపడి ఉంటుంది".

"సరియైన రాజకీయ పంథా చేపట్టిన తర్వాత ప్రతి విషయాన్నీ నిర్మాణ కృషియే (ఆర్గనైజేషనల్ వర్క్) నిర్ణయిస్తుంది. ఆ రాజకీయ పంథా యొక్క భవిష్యత్తు, జయాపజయాలు కూడా దానిపైనే ఆధారపడి ఉంటాయి.

సోషలిజానికి పునాదులు వేయడం కోసం సాగించే పోరాటంలో ఎదుర్కోవలసి వచ్చే చిక్కులనూ, కష్టాలనూ గురించి ముందే తగినంత జాగ్రత్త వహించాలి. ఈ సమయంలో వర్గ పోరాటం ఇంకా తీవ్రతరం అవుతుంది అనే విషయాన్ని దృష్టిలో వుంచుకొని నూతన ప్రజాస్వామిక దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు తమ కమిటీల యొక్క పోరాటశక్తి పెంపొందించుకోవడంకోసం, తమ సభ్యులందరినీ మంచి నిర్మాణయుతంగా సంఘటితపరచడంకోసం తీవ్రంగా పాటుపడుతున్నాయి.

అనేక నూతన శక్తులు పార్టీలోకి కొట్టుకురావడం చేత ఆ దేశాల పార్టీ సభ్యత్వం మాత్రం విరివిగా పెరిగింది. కాని ఇందువల్ల అనేక లోపాలు కూడా ఆ పార్టీలో ప్రవేశించాయి. ఆ పార్టీల యొక్క సాంఘిక సమ్మేళనలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. కార్మికవర్గ సమ్మేళనను దెబ్బకొట్టి పెటీ-బూర్జువా శక్తుల యొక్క ప్రాబల్యం ఎక్కువయింది. పెటీ బూర్జువా శక్తులు మాత్రమే కాకుండా చివరకు బూర్జువాశక్తులూ అభివృద్ధి నిరోధక శక్తులు కూడా పార్టీలో దూరాయి. తత్ఫలితంగా కొన్ని పార్టీల కమిటీల్లో విప్లవాత్మక జాగరూకత మొక్కవోవడం మనం చూస్తూనే వున్నాం.

ఈ విధంగా పార్టీలను దిగజార్చడంవల్ల ఎటువంటి ప్రమాదాలు కలుగుతాయో తెలుసుకోడానికి ఇదొక హెచ్చరిక. హంగేరీ, పోలండు, జకోస్లోవేకియా, బల్గేరియా, కమ్యూనిస్టు పార్టీల కేంద్ర కమిటీలు యీ అనుభవాన్ని పురస్కరించుకొని పార్టీలో చేరే నూతన వ్యక్తులపై కొన్ని పరిమితులను విధించాయి. ఇప్పుడున్న సభ్యత్వాన్ని తిరిగి తనిఖీ చేయాలనీ, నూతన సభ్యులను పార్టీలోకి చేర్చుకునేముందు కొంతకాలం వారిని పరీక్షించాలనీ (ప్రొబెషనరీ పీరియడ్) నిర్ణయించాయి.

రుమేనియా కమ్యూనిస్టు పార్టీలో నాయకస్థానాల్లో వున్న సభ్యులను గురించి ఇది వరకే పరిశీలన ప్రారంభమయింది.

ఈ పద్ధతులవలంబించడం ద్వారా పార్టీ సభ్యుల స్థాయిని పెంపొందించడం జరుగుతుంది. రాజకీయ జాగరూకత అభివృద్ధి చెందుతుంది. పార్టీ సభ్యుల్లో కార్యాచరణ స్వభావం పెరుగుతుంది. మొత్తం పార్టీ యొక్క నిర్మాణ కార్యక్రమమే బలపడుతుంది.

పార్టీల యొక్క నిర్మాణ కృషిని పెంపొందించడానికి పార్టీకి మూలమైన ఫ్యాక్టరీ కమిటీలను, ముఖ్యంగా గ్రామకమిటీలను బలపరచడం అత్యవసరం. ఈ కమిటీలపైనే పార్టీ కృషి ఆధారపడి ఉంటుంది. ఈ కమిటీల ద్వారానే ప్రధానంగా ప్రజాసామాన్యాన్ని సంఘటితపరచడం, పల్లె ప్రాంతాల రాజకీయార్థిక జీవితాన్ని సరిదిద్దడం జరుగుతుంది. కాబట్టి వీటిని బలీయంగా నిర్మించవలసి ఉంటుంది.

ఫ్యాక్టరీ కమిటీల్లోనూ, ముఖ్యంగా గ్రామకమిటీల్లోనూ, ఈనాడు జరుగుతూన్న కృషి అసంతృప్తికరంగా ఉన్నదని అనేక విషయాల ద్వారా స్పష్టమవుతోంది. ఇటీవల బుడాపెస్టు పార్టీ సభ్యుల సమావేశంలో కామ్రేడ్ ఫర్కాస్ ఇచ్చిన రిపోర్టును బట్టి ధాన్యం విడుదల సందర్భంలో ధనిక రైతుల పలుకుబడికి కొన్ని పార్టీ కమిటీలు కొంత వరకూ, మరికొన్ని పార్టీ కమిటీలు పూర్తిగానూ లొంగిపోయినవనీ ధాన్యం విడుదలకు సంబంధించిన పార్టీ పాలసీకి వ్యతిరేకంగా వ్యవహరించాయనీ స్పష్టమయింది.

పార్టీ యొక్క రాజకీయ పంథాను జయప్రదంగా కొనసాగించడం ఆయా స్థానాల్లో ఆయా స్థానాలకు తగిన సభ్యులనే నియమించడం పైన ఆధారపడి ఉంటుంది.

ప్రజాస్వామిక ప్రజాతంత్ర దేశాలలో కమ్యూనిస్టు పార్టీలే ఆ దేశాల నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను పూర్తిగా నిర్వహిస్తున్నాయి. కాబట్టి ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే కార్మికవర్గం నుంచీ, కష్టజీవుల నుంచీ వచ్చిన తమ (పార్టీ) సభ్యులకు ముందుగా తగిన తర్ఫీదు ఇవ్వవలసి ఉంటుంది. పార్టీ సిద్ధాంతాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పార్టీకోసం తమ సర్వస్వం ధారవోసే ఆ సభ్యులే కష్టజీవుల నుంచీ, కార్మికవర్గం నుంచీ వచ్చిన ఆ సభ్యులే పార్టీ పంథాను జయప్రదంగా ఆచరణలో పెట్టగలరు.

పార్టీ సభ్యులకు శిక్షణ ఇచ్చే విషయమై ఇది వరకే చాలా కృషి జరిగింది. పార్టీకి తమ సర్వస్వం అర్పించడానికి సిద్ధంగా ఉండి తగు శిక్షణపొందిన వేల కొలది పార్టీ సభ్యులు ప్రభుత్వ, ఆర్థిక, పరిపాలనాది శాఖల్లో ఉన్నత స్థానాలకు తీసుకోవడం జరిగింది. అయినప్పటికీ పార్టీసభ్యులకు శిక్షణ ఇవ్వడంలోనేమి, వారిని పై మెట్టుకు పంపడంలోనేమి, చేయవలసిన కృషి ఇంకా చాలా ఉంది.

పార్టీ సభ్యులను సరియైన దారిలో నడిపించేందుకు పార్టీ నిర్ణయాలను ఎవరు ఎంత వరకు పాటిస్తూ ఉందీ ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం అత్యవసరం. అసలు సూచనలెలాంటివో, ఆ సూచనలను ఎలా అమలు పరుస్తున్నారో ఈ రెంటినీ పోల్చి చూడడమే పార్టీ సభ్యులకు సరియైన దారిచూపడం అవుతుంది.

పార్టీ, ప్రభుత్వ, ఆర్థికశాఖల యొక్క కృషిని సరిగా పరిశీలించడం వల్ల ప్రజలను పురోగమింపచేయడం, వారిని విద్యావంతులుగా చేయడం, లోపాలు రాకుండా ఎలా చూడాలో ప్రజలకు నేర్పడం, తమదే ప్రధాన బాధ్యత అని ప్రజలచే గుర్తింపచేయడం, జరుగుతుందని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ అనుభవం తెలియజేస్తోంది.

పార్టీ యొక్క ప్రభుత్వం యొక్క అన్ని దశల్లోనూ, పైనుంచి క్రింది వరకూ, తనిఖీ చేయడం, అదుపులో ఉంచడం, పార్టీసభ్యులందరినీ పనిలో ప్రవేశపెట్టడం అనేదే అసలు సమస్య. చురుకుగా పనిచేసే సభ్యుల మీటింగులూ, సమావేశాలూ ఒక క్రమపద్ధతిపై జరపడం, పార్టీ నిర్ణయాలను ఎంత వరకు పూర్తి చేసిందీ తనిఖీ చేయడానికీ, నిర్ణయాలను అమలుపరచేందుకు పార్టీ సభ్యులందరినీ సమీకరించడానికీ, చురుకుగా పనిచేసే సభ్యుల మీటింగులూ, సమావేశాలూ తప్పకుండా జరుపుతూ ఉండడం ఉత్తమమైన పద్ధతి అని మన అనుభవమే తెలియజేస్తూ ఉంది.

సరియైన నాయకత్వాన్ని నిర్మించడానికి నాయకుల యొక్క అనుభవం మాత్రమే చాలదు అని లెనినిజం మనకు బోధిస్తూ ఉంది. పార్టీ ప్రజల యొక్క అనుభవంతోనూ, కార్మికవర్గం యొక్క, కష్టజీవులందరి యొక్క అనుభవంతోనూ నాయకుల యొక్క అనుభవాన్ని జోడించవలసి ఉంటుంది.

మార్క్సిజంలో శిక్షణ పొందిన క్యాడర్లు మాత్రమే రోజు రోజుకూ పెరిగిపోతూ ఉండే బాధ్యతలను సరిగా నిర్వహించడానికి తగిన సమర్థత కలిగి ఉంటారు. కాబట్టి పార్టీ నిర్మాణ కృషిని బలపరచడానికీ, పార్టీ నెదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికీ క్యాడర్లను మార్క్సిజం-లెనినిజంలో సరియైన శిక్షణ ఇవ్వడం అత్యంతావసరం.

ఈ సంవత్సరం క్యాడర్లకు తగిన తర్ఫీదు ఇవ్వడానికి పార్టీ కమిటీలు బాగా కృషి చేశాయి. ఆయా జాతులకూ, ఆయా ప్రదేశాలకూ, సంబంధించిన స్కూళ్ళనూ, తదితర పాఠశాలలను పార్టీలు నడిపాయి. అధ్యయన కేంద్రాల సంఖ్య పెరిగింది.

మార్క్సిజం-లెనినిజాన్ని స్వయంగా, వ్యక్తిగతంగా అధ్యయనంచేసి అర్థం చేసుకోవాలనే ఆకాంక్ష కూడా పార్టీ సభ్యుల్లో ప్రబలంగా ఏర్పడింది. పార్టీలు సర్వతోవ్యాప్తంగా సాగించే విద్యాబోధన ద్వారా లక్షల కొలది పార్టీ సభ్యులు విద్యావంతులవుతున్నారు.

పార్టీలో వచ్చిన యీ అభివృద్ధి చాలా సంతోషించదగినదే. కాని సిద్ధాంత పరిజ్ఞానాన్ని బోధించే విధానంలో- శిక్షణ యివ్వడంలో ఇంకా చాలా పెద్దలోపాలు జరుగుతూ వున్నాయి. ప్రధాన పార్టీ సభ్యులందరూ స్కూళ్ళల్లో పాల్గొనడం లేదు. సిద్ధాంతాలను సరిగా అధ్యయనం చేయడం లేదు. ఈ కార్యక్రమానికి ఎక్కువగా ఉపయోగించే నేర్పుగలిగిన ప్రచారకులకు యీ బాధ్యత ఒప్పగించడం ఇంకా అన్నిచోట్లా జరగడంలేదు.

పార్టీ అభివృద్ధికి ప్రధాన సంచాలక శక్తిగా పనిచేసే విమర్శ-ఆత్మ విమర్శ ద్వారా పనిపాటల్లో వచ్చే లోటుపాట్లను ముఖ్యంగా దిద్దుకోవలసి ఉంటుంది. కాని ఈ విమర్శ-ఆత్మవిమర్శ అనేది రాణించాలంటే, పార్టీ కృషిని ఇంకా ముందుకు తీసుకుపోవడానికి అది ఉపయోగపడాలంటే, విమర్శనూ, ఆత్మవిమర్శనూ అణచివేయనట్టి పరిస్థితులుండడం అందుకత్యవసరం. విమర్శ మంచిదే అని మాటల్లో అంగీకరించినా, ఆచరణలో దానిని వ్యతిరేకించేవారిని సహించగూడదు.

విమర్శ-ఆత్మవిమర్శను గురించి పదే పదే మాట్లాడే కొందరు బాధ్యత గల కార్యకర్తలే తమ స్వంత విషయం వచ్చేటప్పటికి ఎడమొగం పెడమొగం బెట్టడం జరుగుతూ వుందని ఇటీవల జరిగిన జెకోస్లావేకియా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ విస్తృత సమావేశంలో ఆ పార్టీ నాయకులు హెచ్చరించడం జరిగింది.

కమ్యూనిస్టుపార్టీలు ప్రజలతో అత్యంత సన్నిహిత సంబంధాన్ని కలిగి వున్నాయి. అసంఖ్యాకులైన కష్టజీవుల యొక్క విప్లవ పోరాటాన్ని నడుపుతూ ఉన్నాయి. వర్గసంఘర్షణ తీవ్రతరమైన నేటి పరిస్థితుల్లో సామ్రాజ్యవాదానికీ, అభివృద్ధి నిరోధకతత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామికంకోసం, అభ్యుదయంకోసం, సోషలిజం కోసం సాగించే పోరాటంలో ప్రజానీకాన్ని ఐక్యంచేసి సంఘటితపరుస్తున్నాయి.

ఈ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు పోరాట, విప్లవానుభవాన్ని గడిస్తున్నాయి. విజయం ఎలా సాధించాలో నేర్చుకుంటున్నాయి.

త్వరలోనే జరగబోతూన్న పోలండు, బల్గేరియా, జెకోస్లావేకియా కమ్యూనిస్టు పార్టీల మహాసభలు పార్టీ నిర్మాణ, రాజకీయ కృషిని పెంపొందించడం ద్వారా ఇందుకెక్కువగా తోడ్పడగలవు. పై మహాసభల చర్చనీయాంశాలలో తదితర విషయాలతోపాటు పార్టీ నిబంధనలు, పార్టీ కార్యక్రమం కూడా ఉండడం పార్టీ నిర్మాణ స్వరూపానికీ, నిర్మాణ కృషికీ అవి తగిన ప్రాముఖ్యతనిస్తున్నట్లు ద్యోతకమవుతోంది.

నిర్మాణ కృషిని ఇంకా ఉత్తమంగా ఉన్నతస్థాయిలో సాగించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీలకు నిస్సందేహంగా నూతనబలం చేకూరుతుంది. వాటి పోరాటశక్తి పెంపొందుతుంది. వాటి నెదుర్కొంటూన్న రాజకీయ బాధ్యతలను త్వరితంగా నిర్దుష్టంగా నిర్వహించడంలో ఆ పార్టీలకు తగిన శక్తి సామర్థ్యాలను కలిగిస్తుంది.

"ఫర్ ఏ లాస్టింగ్ పీస్, ఫర్ ఏ పీపుల్స్ డెమాక్రసీ"

(15.12.1948) ◈

వెలువడింది!
రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

వార్షిక సంచిక-2007

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధులకు జేజేలు

1857

వెల: రు. 30.00

ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్,
కారల్‌మార్క్స్ రోడ్, జలీల్ వీధి,
విజయవాడ-2.

చేనేత రంగ సంక్షోభాన్ని మౌలికంగా పరిష్కరించకుండా తాత్కాలిక చర్యల వలన నేత కార్మికుల ఆత్మహత్యలను, ఆకలి మరణాలను నివారించటం సాధ్యం కాదు

దేశంలో వ్యవసాయం తర్వాత ప్రజలకు జీవనాధారాన్ని కల్పించే మరో ప్రధాన రంగమయిన చేనేత రంగం సంక్షోభంలోకి నెట్టబడింది. ఫలితంగా చేనేత రంగంపై ఆధారపడి జీవనాధారాన్ని కొనసాగించే నేత కార్మికుల జీవితాలు ఛిద్రమయ్యాయి. చేతినిండా పని దొరకక, పని దొరికినా తగు కూలీ ముట్టక, ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు అందుబాటులో లేక రోజువారీ జీవితాన్ని సాగించటానికి అవసరమైన కనీసపు ఆర్థిక స్థోమత కూడా లేక వేలాది నేత కార్మిక కుటుంబాలవారు దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ తీవ్రఅనారోగ్యాల బారినపడి, ఆకలితో అలమటిస్తున్నారు. చేసిన అప్పులు తీర్చలేని దుస్థితిలో ప్రస్తుతం అప్పులు దొరకని నిస్సహాయ స్థితిలో తమను పట్టించుకొనే నాధుడేలేని దౌర్భాగ్యస్థితిలో అనివార్యంగానే అనారోగ్య మరణాలు, ఆకలి మరణాలు లేదా ఆత్మహత్యలకు గురవుతున్నారు.

చేనేత కార్మికులనూ, వారి కుటుంబ సభ్యులనూ యింతటి నికృష్టమయిన దుస్థితికి నెట్టినది, యింత కాలంగా ప్రభుత్వం అవలంబించి అమలుపరుస్తున్న అపసవ్య విధానాలే అన్నది నిస్సందేహమైన విషయం.

నాడు బ్రిటీష్ వలస పాలకులు తమ వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కోసం మన దేశంలోని సాంప్రదాయక చేనేత పరిశ్రమను ధ్వంసం చేయటానికి అవసరమైన విధానాలను అమలుచేస్తే, నేటి "స్వతంత్ర" పాలకులు దేశాభివృద్ధి-పారిశ్రామికాభివృద్ధి అనే నినాదాల మాటున బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను పెంపొందించే విధానాలను అవలంబించి, వాటిని అమలుపరచటం ద్వారా చేనేత రంగాన్ని తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టి, ఆ రంగంలో తమ జీవనోపాధిని నెరపుకొంటున్న లక్షలాది మంది నేత కార్మికుల, అనుబంధ కార్యకలాపాలను నిర్వహిస్తున్న కార్మికుల జీవితాలను ఛిద్రం చేయటం జరిగింది. ఈ విధానాల పర్యవసానమే మనం గత పదేళ్ళ కాలంగా ప్రతి రోజు చూస్తున్న నేత కార్మికుల ఆత్మహత్యలూ-ఆకలి మరణాలూ -అనారోగ్య మరణాలు.

గత పదేళ్ళుగా ఈ రంంలోని కార్మికులు ఈ రకంగా తిండిలేక, పని దొరకక, అప్పులు తీర్చలేక, అనారోగ్యాన్నుండి బయటపడేందుకు అవసరమైన వైద్య సదుపాయం అందుబాటులో లేక అనాధల్లా మరణిస్తున్నా ప్రభుత్వాలు మాత్రం వీరి సమస్యలకు మౌలికమయిన పరిష్కారాన్ని చూపించటానికి బదులు, తాత్కాలిక చర్యలతో కాలం గడిపేస్తూ ఈ సమస్య మరింత తీవ్రతరం కావటానికి కారకులయ్యారు.

1985వ సంవత్సరంలో రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన నూతన జౌళి విధాన ఫలితంగా, ఈ రంగంలోకి యంత్రాల ప్రవేశానికి ఆస్కారం కల్పింపబడటంతోపాటు, గణనీయంగా మరమగ్గాలు పెరిగిపోవటానికి ప్రోత్సహం లభించింది. ఈ మరమగ్గాల ప్రవేశం వలన ఒక్కో మరమగ్గం 12 మంది చేనేత కార్మికుల జీవనోపాధి హరించటం జరిగి, అప్పటికే సంక్షోభ స్థితికి చేరుకొంటున్న చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడింది. అంత వరకూ చేనేత రంగానికి కల్పింపబడ్డ అరా, కొరా రక్షణలను సహితం ప్రభుత్వం తొలగించింది. ఈ నూతన జౌళి విధానం చేనేతను, మరమగ్గాలను, మిల్లు బట్టల ఉత్పత్తినీ ఒకే రంగం క్రిందకు తీసుకురావటం జరిగింది. ఫలితంగా జౌళి రంగ అభివృద్ధికోసం ప్రభుత్వం కేటాయించిన మొత్తాల్లో ఎక్కువ భాగం మిల్లు యజమానులు, మరమగ్గాల యజమానులు కైంకర్యం చేసి లాభపడ్డారు. చేనేత రంగానికి ముట్టిన మొత్తాలన్నింటినీ సొసైటీల పేరిట పెత్తందార్లూ, మాస్టర్ వీవర్లూ దండుకొన్నారు. సాధారణ నేత కార్మికుడి పరిస్థితి మాత్రం నానాటికీ దిగజారి పోతూనే వుంది. ఇదే పరిణామం అటు మరమగ్గాలపై వనిచేసే సాధారణ కార్మికులలోనూ, మిల్లు కార్మికులలోనూ సంభవించింది.

1990 దశకంలో భారత ప్రభుత్వం సరళీకరణ ఆర్థిక విధానాల అమలును ప్రారంభించింది. ఈ విధానాలు చేనేత -మరమగ్గ రంగ కార్మికుల ఊపిరిని పూర్తిగా తీసివేశాయి. స్వేచ్ఛాయుత పోటీ, స్వేచ్ఛాయుత మార్కెట్ల పేరిట ఎగుమతి ఆధారిత పరిశ్రమగా చేనేత రంగాన్నీ, మరమగ్గాల రంగాన్ని మలచటం జరిగింది. మరోవైపు చేనేత రంగానికి అవసరమయిన ముడిసరుకులేకాక, విదేశీ బట్టలు యిబ్బడి, ముబ్బడిగా మన దేశపు మార్కెట్లలోకి ప్రవేశించటానికి గేట్లు బార్లా తెరవబడ్డాయి. ఇంకోవైపు దేశంలోని సహకార, ప్రభుత్వరంగంలోని టెక్స్‌టయిల్స్, నూలు మిల్లులను మూసివేయటం జరిగింది. సూటిగా చెప్పాలంటే జౌళిరంగం ఎటువంటి నియంత్రణా లేకుండా మార్కెట్టుశక్తుల దయాదాక్షిణ్యాలకు అప్పచెప్పటం జరిగింది. ఫలితంగా ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహకాలు, రాయితీలు, పరపతి సౌకర్యాలు బడా పారిశ్రామిక వేత్తలూ, జెట్‌లూం యజమానులూ కాజేశారు. మరోవైపు ముడిసరుకులైన రంగులు, నూలు ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ప్రపంచబ్యాంకు ఆదేశం మేరకు నాణ్యమయిన, సమర్థవంతమైన విద్యుత్ సరఫరాకోసమని చెప్పి 3 విభాగాలుగా విభజింపబడ్డ ఏ.పి.ఎస్.యి.బి., విద్యుత్ యొక్క ధరనైతే విపరీతంగా పెంచగల్గింది తప్ప, నాణ్యమయిన-సమర్థవంతమైన విద్యుత్ సరఫరాను చేయటంలో విఫలమయింది. గతంలోకన్నా విద్యుత్‌లో ఓల్టేజి సమస్యలూ, పవర్ కట్లూ ఈ విద్యుత్ బోర్డు విభజన అనంతరం మరింతగా పెరిగిపోయాయి.

ఈ రకంగా పెరిగిన నూలు ధరలు, రంగుల ధరలు, మరమగ్గాలు నడవటానికి అవసరమయిన విద్యుత్ సరఫరా కొరతలు అటు చేనేత రంగాన్నీ, యిటు మరమగ్గాల రంగాన్నీ మరింత సంక్షోభంలోకి నెట్టివేశాయి. దేశంలోని ప్రజల వస్త్ర అవసరాలకు అనుగుణమైన జౌళి విధానం కాక, విదేశీ మార్కెట్ల అవసరాల కోసం ఎగుమతి చేసే విధానం అవలంబించటం వలన చేనేత, మరమగ్గ నేత రంగాలు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. బడా పరిశ్రమలకు అనేక రాయితీలు యిచ్చి ప్రోత్సహించే ప్రభుత్వ జౌళి విధానం, చేనేత-మరమగ్గాల రంగాల నిర్వీర్యం చేసే విధానాలను చేపట్టింది. మరోవైపు చైనా, తదితర దేశాల నుండి తక్కువ ధరకు లభించే వస్త్రాలు భారీ ఎత్తున దేశంలోకి దిగుమతి చేయడం వలన కూడా చేనేత రంగం నష్టపడటానికి కారణమయింది. ఈ సంక్షోభ భారమంతా అనివార్యంగా రోజువారీ కూలికి పనిచేసే చేనేత కార్మికులపైకి నెట్టబడింది. మాస్టర్ వీవర్లూ, మరమగ్గాల యజమానుల వరకూ ఈ సంక్షోభ ప్రభావాన్నుండి బయటపడగల్గారు. తమ శ్రమ తప్ప మరే యితర ఆధారంలేని సాధారణ కార్మికులు- వారి కుటుంబ సభ్యులూ ఈ సంక్షోభానికి బలయ్యారు. అందువల్లనే వీరంతా ఆకలి మరణాల బారిన పడుతున్నారు. తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

అయితే ప్రభుత్వం మాత్రం వీరివి ఆకలి మరణాలు కావనీ, జీవనోపాధి లేమి వలన సంభవిస్తున్న ఆత్మహత్యలు కాదంటూ కొట్టిపారేస్తున్నది. అనారోగ్యం వలనా, త్రాగుడు దురలవాటు వలనా వీరు మరణిస్తున్నట్టు ప్రచారం కావిస్తోంది.

వాస్తవానికి తగు జీవనోపాధి లేక, సరయిన పోషకాహారం లభించక వీరు అనారోగ్యం పాలవుతున్నారు, తమ దుర్భర ఆర్థిక పరిస్థితి నుండి బయటపడే మార్గం కానక తాత్కాలిక మానసిక ఉపశాంతికోసం త్రాగుడు నాశ్రయిస్తున్నారు. ఆ రకంగా ప్రభుత్వ విధానాలే వీరిని అనారోగ్యం, త్రాగుడు దురలవాటు పాలు చేస్తున్నాయి. అంతిమంగా వీరి మరణం- ఆకలి వల్లకానీ ఆత్మహత్యల వల్లకానీ సంభవిస్తోంది. వీరికి సరయిన, నిరంతర జీవనోపాధి అవకాశాలు అందుబాటులో వుంటే వీరు ఈ రకంగా అనారోగ్యం, త్రాగుడు, ఆకలిచావులు, ఆత్మహత్యల బారిన పడనవసరం ఏర్పడదు.

వీరికి శాశ్వత జీవనోపాధి, వీరి బిడ్డలకు, కుటుంబసభ్యులకు విద్యా-వైద్య సదుపాయాలు, గృహవసతి యితర సంక్షేమ సౌకర్యాలు కల్పించటం ద్వారా వీరి సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

కానీ ప్రపంచీకరణ పేరిట అమలుజరుగుతూ, సాగుతున్న సామ్రాజ్యవాద దోపిడీ, పెత్తనాలను అరికట్టి, నియంత్రించే ఇచ్ఛా, సత్తాలు మన పాలకులకు ఎంత మాత్రమూ లేవు. అందువల్లనే తాత్కాలిక చర్యల ద్వారా సమస్యను దాటవేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

నాడు 2004లో నాటి రాష్ట్ర ప్రభుత్వం 'సిరిసిల్ల' నేత కార్మికుల సమస్యలపట్ల అటువంటి వైఖరినే అవలంబించింది. తిరిగి నేడు వైయస్సార్ ప్రభుత్వం అటువంటి చర్యల ద్వారానే సమస్యను పరిష్కరించినట్టు ఘనంగా ప్రచారం చేసుకొంటోంది. ప్రభుత్వమే స్వయంగా ప్రోత్సహిస్తున్న మైక్రో ఫైనాన్సు సంస్థల అప్పులు తీర్చటానికి, బ్యాంకుల నుండి పావలా వడ్డీకి రుణాలు యిప్పిస్తానంటోంది. ఆ రకంగా ప్రభుత్వం మైక్రో ఫైనాన్సు సంస్థలకు లాభం చేస్తోందే తప్ప, బాధిత నేత కార్మికుల సమస్యలను పరిష్కరించటం లేదు.

(తరువాయి 5వ పేజీలో)

హోండా ఫ్యాక్టరీలో క్యాజువల్ కార్మికుల సమ్మె

హర్యానా రాష్ట్రంలోని దారుహెరాలో గల హోండా బైక్‌ల ఉత్పత్తి కర్మాగారంలో, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కనీస బేసిక్ వేతనం చెల్లించాలని డిమాండుచేస్తూ కార్మికులు అక్టోబరు 12వ తేదీన సమ్మెకు దిగారు.

హోండా కంపెనీ "స్ప్లెండర్ ప్లస్', 'సి.డి.డీలక్సు' మోడల్ బైక్‌లను రోజుకు 5,000 యూనిట్లను ఉత్పత్తి చేసే ఈ ఫ్యాక్టరీలో 4,500 మంది కార్మికులు పనిచేస్తూ వుండగా అందులో 3000 మంది క్యాజువల్ కార్మికులుగానే వున్నారు.

హర్యానా రాష్ట్ర ప్రభుత్వం క్యాజువల్ కార్మికులకు నెలకు 4,200 రూ.ల బేసిక్ వేతనం చెల్లించాలని నిర్ణయించింది. అయినా హోండా కంపెనీ మాత్రం వారికి నెలకు 3,500 రూపాయలనే బేసిక్ వేతనంగా చెల్లిస్తోంది. తమకు ప్రభుత్వం నిర్ణయం చేసిన మేరకు నెలకు 4,200 రూపాయల బేసిక్ వేతనం చెల్లించాలని డిమాండుచేస్తూ, ఆ ఫ్యాక్టరీలోని కార్మికులు సమ్మెకు దిగారు.

ఆదివారం అక్టోబరు 12న క్యాజువల్ కార్మికులు సమ్మెకు దిగితే, హోండా యాజమాన్యం, సోమవారం అక్టోబరు 13న ఫ్యాక్టరీని మూసివేసింది. ముందు జాగ్రత్త చర్యగా తాను ఒక రోజు ఫ్యాక్టరీ మూసివేసినట్లు ప్రకటించింది. ఈ మూసివేత ద్వారా భయపెట్టి శాశ్వత కార్మికులు సమ్మెలో పాల్గొనకుండా జాగ్రత్త పడింది.

అక్టోబరు 14 నుండి శాశ్వత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులూ పనిలో చేరితే, ఫ్యాక్టరీ పని చేస్తున్నట్టుగా ప్రకటనలు చేస్తోంది. వాస్తవానికి క్యాజువల్ కార్మికులు సమ్మె చేస్తూనే వున్నారు.

బయటనున్న అసాంఘికశక్తులు క్యాజువల్ కార్మికులను రెచ్చగొట్టి ఆదివారం, అక్టోబరు 12నాడు బైఠాయింపు సమ్మె జరిపించారని, యిందుకు విరుగుడుగా అక్టోబరు 13న ఫ్యాక్టరీని మూతవేసాననీ కంపెనీ యాజమాన్యం చెప్తోంది.

గతంలో ప్రభుత్వం పోలీసుల ద్వారా ఆందోళన జరిపే కార్మికులపై పోలీసు నిర్బంధాన్ని అమలుజరిపిన చరిత్ర గల హోండా యాజమాన్యం, యిప్పుడు బయట వ్యక్తుల, అసాంఘికశక్తుల ప్రేరణ అనే కారణంతో క్యాజువల్ కార్మికుల సమ్మెను దారుణంగా అణచివేసే ప్రయత్నంలో వుంది.

పారిశ్రామికాభివృద్ధి పేరిట విదేశీ పెట్టుబడికీ-విదేశీ కంపెనీల యాజమాన్యాలకూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులశక్తిని నికృష్టంగా దోచుకోవటానికి అవకాశాలు కల్పించటమేకాక, తాము నిర్ణయించిన చట్టబద్ధ కనీస వేతనాలను ఆ యాజమాన్యాలు చెల్లించకపోయినా, ఆ యాజమాన్యాలకే వంత పాడుతున్న ప్రపంచీకరణ భాగోతాన్ని మనం ఈ హోండా కార్మికుల ప్రత్యక్ష అనుభవ రూపంలో చూస్తున్నాం.

క్యాజువల్ కార్మికుల సమంజసమైన, చట్టబద్ధమైన కనీస వేతనం కోసం చేస్తున్న డిమాండును హోండా యాజమాన్యం అంగీకరించే విధంగా, హర్యానా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని 'జనశక్తి' డిమాండుచేస్తూ, సమ్మె చేస్తున్న క్యాజువల్ కార్మికులకు తన సంఘీభావాన్ని తెల్పుతోంది. ◈

భారత రైల్వేల బోనస్ బూటకం

ప్రతీ సంవత్సరం భారత రైల్వేలు తమ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు యిన్ని రోజులు బోనస్‌ను చెల్లింపబోతున్నట్లు చేస్తున్న ప్రకటనలను మనం చూస్తూనే వుంటాం. రైల్వేల యాజమాన్యమూ, భారత ప్రభుత్వమూ ఎంతో ఉదారంగా ఈ రైల్వే ఉద్యోగులకు ప్రతీఏటా బోనస్ చెల్లిస్తున్నందుకు ఎంతగానో ఆనందపడతాం. ఇతర ప్రభుత్వ శాఖల్లో-పరిశ్రమల్లో యిదే మాదిరి బోనస్ చెల్లించనందుకు బాధపడుతూనే, రైల్వే కార్మికులకు ఈ రకంగా "భారీ" ఎత్తున బోనస్ చెల్లింపబడ్తున్నందుకు అసూయపడ్తాం కూడా.

ఈ సంవత్సరం రైల్వే కార్మికులకు 73 రోజుల బోనస్‌ను చెల్లించటానికి నిర్ణయించి, ప్రభుత్వం అందుకోసం రైల్వేల ద్వారా 600 కోట్ల రూపాయలు కేటాయించినట్లు పత్రికల్లో చూశాం.

అంటే ప్రతీ రైల్వే ఉద్యోగికీ (ఉన్నతస్థాయి అధికారులకు తప్ప) యించుమించుగా 2 1/2 నెలల జీతం బోనస్‌గా చెల్లింపబడుతుందని మనం అర్థం చేసుకొంటున్నాం. అంటే ఈ సంవత్సరం రైల్వే కార్మికులకు 20.23% బోనస్ చెల్లింపబడిందని మనం భావిస్తున్నాం.

అయితే వాస్తవంగా ఆ ఉద్యోగులకు ఆ మేరకు బోనస్ చెల్లింపులు జరగలేదు. నెలకు గరిష్టంగా 3,500 రూ. చొప్పున 73 రోజులకూ కేవలం 8,360 రూపాయల మొత్తం మాత్రమే బోనస్‌గా చెల్లింపబడింది. అయితే క్రిందటి సంవత్సరందాకా నెలకు 2,500 రూపాయలనే గరిష్ట మొత్తంగా పరిగణించిన రైల్వే యాజమాన్యం ఈ సంవత్సరం ఆ గరిష్ట మొత్తాన్ని 3,500కు పెంచింది.

భారత కార్మికవర్గం-ప్రత్యేకించి భారతీయ రైల్వే కార్మికోద్యమం అనేక పోరాటాల ద్వారా బోనస్ హక్కును సాధించుకుంది. కార్మికులకు వాయిదా వేయబడిన వేతనమే బోనస్ అన్న ప్రాతిపదికపై కార్మికవర్గం ఈ బోనస్‌ను డిమాండ్ చేసి, అంగీకరింపచేసి, సాధించటం జరిగింది. అయితే ఈ అవగాహనను తిరస్కరిస్తూ 1964లోనే భారత ప్రభుత్వమూ, పారిశ్రామిక వర్గాలవారూ కుమ్మక్కై లాభాలపై ఆధారపడి బోనస్ చెల్లింపు అనే వైఖరిని ప్రతిపాదించి, 1966లో దాన్ని బోనస్ చట్టం రూపంలో తీసుకొచ్చారు.

తప్పుడు లెఖ్ఖలు చూపించి, లాభాలు రావటం లేదనివాదిస్తూ, ఆ చట్ట ప్రకారం చెల్లించాల్సిన బోనస్‌ను కూడా కార్మికులకు చెల్లించకుండా ఎగనామం పెట్టారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో కనీస బోనస్‌ను 8.33% నుండి 4%కు తగ్గిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది.

అప్పటి నుండి బోనస్ చెల్లింపుపై అనేక ఆంక్షలు, చెల్లించాల్సిన మొత్తంపైన గరిష్ట పరిమితి విధింపులూ విధిస్తూ, ఆచరణలో కార్మికవర్గంలో 95% మందికి అసలు బోనస్ చెల్లింపు అనేదే లేకుండా మార్చివేయటం జరిగింది.

తదనంతర కాలంలో ఉత్పత్తికీ-బోనస్‌కూ ముడిపెట్టి, చెల్లించటం అనే పద్ధతి మొదలయింది. రైల్వేలలో ఉత్పాదకతపై ఆధారపడిన బోనస్ చెల్లింపు విధానం మొదలైంది.

ఈ విధానం ప్రకారమే కార్మికులకు బోనస్ చెల్లింపబడుతోందని చెప్పబడుతున్నా, ఆచరణలో బోనస్‌ను నిర్ణయించటానికి గరిష్ట వేతన గణన విధానం పేరిట నెలకు 3,500/- రూపాయలను గరిష్ట వేతనంగా నిర్ణయిస్తూ, పేరుకు 73 రోజుల వేతన బోనస్‌గా చెల్లింపబడుతుందని చెప్తున్నా, ఆచరణలో కేవలం 73 రోజులకుగాను రు.8,360/-లు లేదా అంతకు లోపు మాత్రమే చెల్లించటం జరుగుతోంది.

కానీ ప్రచారం మాత్రం 73 రోజుల వేతనం చెల్లించుతున్నట్లు జరుగుతోంది.

ఈ రకంగా మోసపూరిత విధానంతో, బూటకమైన పద్ధతిలో రైల్వే కార్మికులకు-ఉద్యోగులకు బోనస్ చెల్లించటం జరుగుతోంది..

వాయిదా వేయబడ్డ వేతన చెల్లింపులే బోనస్ అన్న అవగాహన తిరస్కరించబడింది.

పలు బలహీనతలకు లోనైన భారత కార్మికోద్యమ నాయకత్వం "చిక్కిందే దక్కుడు" అన్నట్లు, యాజమాన్యాలు యిచ్చిన మేరకే ఆ బోనస్‌ను ఆనందంగా అందుకోమని కార్మికులకు బోధిస్తూ, అదే తాము సాధించిన విజయం అన్నట్లు ప్రచారం చేసుకొంటున్నాయి.

అంతిమంగా బోనస్ అనేది కార్మికునికి ఒక హక్కుగా కాక దయాధర్మ భిక్షం స్థాయికి కుదింపబడింది.

భారత కార్మికవర్గం యీ హక్కుపట్ల సక్రమ అవగాహనను ఏర్పాటు చేసుకొని, దాని సాధనకోసం ఐక్యంగా పోరాటాలు సాగించాల్సి వుంది. ◈

లేఖ

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక "జనశక్తి" ఎడిటర్ గార్కి, కామ్రేడ్ వసంతాడ రామలింగాచారి గారి స్మారక కమిటీ వారు విప్లవాభినందనలు తెలుపుతూ వ్రాయునది-

20.6.2008న జనశక్తి "విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక" లో "విప్లవోద్యమ అభివృద్ధి క్రమాన్నీ, దానిలో వచ్చిన ధోరణుల్ని ఆచరణ ఫలితాలను సావధానంగా చర్చించుదాం" విశ్వం విరచిత వ్యాసం సాంతం చదివాక గతంలో పరిచయంలేనివాళ్లకు కూడా రచయిత యొక్క విశ్వరూపం ప్రస్ఫుటంకాక తప్పదు. ఎవరి డప్పు వాళ్ళు వాయించుకోవటం, ఎవరి శంఖం వాళ్లు ఊదుకోవటం వరకు సహజమని సమర్థించుకున్నా, విప్లవోద్యమ క్రమంలో జరిగిన వాస్తవాలను వక్రీకరించడం, మభ్యపెట్టడం, కామ్రేడ్ విశ్వంకే చెల్లును. ఇది వారి స్వీయ మానసిక, కెరియరిస్టు పెడధోరణికి అద్దం పట్టింది. ఈ అపరచాణుక్యుని అజమాయిషీలోని ప్రజాసంఘాల బాధ్యులు వాటిని భ్రష్టుపట్టిస్తున్న తీరుచూసి, విప్లవం చూస్తామని ఆశపడ్డవారు, అందులో పనిచేసి గాయపడినవారు, వెనుకపట్టు పట్టిన వ్యక్తుల్ని మనం కదిపితే లేదా కదిలించాలని చూస్తే వాళ్ల కుదుపులకి "ఈ విశ్వం"...ఎక్కడుంటారు?

శ్రీకాకుళ గిరిజనోద్యమ కాలం నుండి వివిధ చీలికల క్రమం, పార్టీల వైఖరులు నాయకత్వ బాధ్యుల ధోరణులను ఎద్దేవా చేస్తూ విప్లవకారులందరికీ విశ్వం-సూక్తులు ఏకరువుపెట్టి, తన గురివింద గింజ స్వభావాన్ని వారి మితవాద సంస్కరణవాద ఊబిలో కూరుకుపోయిన వైనం మభ్యవరచుకోవడం, "ప్రజాయుద్ధపంథాలో సాగుతున్న పార్టీ మాదే" అని గుండెలు బాదుకుంటున్న కా॥ విశ్వం, వాళ్ల అంతర్గత సమస్యలని చర్చకు పెట్టి పరిష్కరించుకోలేక, విప్లవోద్యమ క్రమంలో వచ్చే ధోరణులని ఆచరణ ఫలితాలను తగుదునమ్మా అని చర్చించేందుకు పూనుకోవడం ఎంత ఆపహాస్యమో అందరికీ తెలిసిందే. విప్లవోద్యమ క్రమంలో అనుభవాలు గడించిన త్యాగశీలులు, కార్యకర్తలు ఆ విప్లవోద్యమ క్రమాన్ని సమీక్షించి, విప్లవ గుణపాఠాలను భావితరాలకు అందించటం జరిగితే ఎంతో ఉపయోగకరం.

వీర తెలంగాణా రైతాంగ విప్లవ పోరాటం తరువాత శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం అంతటి పేరుగాంచింది. ఆ ఉద్యమక్రమంలో కారణాలు ఏమైనా విప్లవపార్టీ అనేక చీలికలు, పీలికలుగా గురికాబడటం జరిగినా, అప్పటిలో మాస్ లీడర్‌గా కా॥ తరిమెల నాగిరెడ్డి, నిర్మాణ దక్షకుడిగా కా॥ వసంతాడ రామలింగాచారి గుర్తింపు పొందారు. కా॥ వసంతాడ శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమనేతగా జిల్లా బాధ్యతలతోపాటు రాష్ట్ర కమిటీ బాధ్యతలు చేపట్టి ప్రజాయుద్ధ పంథాలో, చైతన్యయుత విప్లవ కార్యాచరణను గిరిజన రైతాంగ ప్రజానీకంలో నెలకొల్పి, రాజ్యాంగ యంత్రాన్ని ఢీకొని ఘర్షణపడే వర్గ ఉద్యమంగా మలిచారు. అటువంటి వర్గ దృక్పథంతో ఉద్యమ నిర్మాణంకోసం పాటుపడే ఆచరణే ఆయన స్వభావంగా ఉంది తప్ప. విశ్వంగారు వర్ణించినట్లు ఒకరికి వ్యతిరేకంగా వ్యక్తులను కూడగట్టడం కా॥ రామలింగాచారికి చేతకాదు, ఆ దృక్పథం లేదు. కనుకనే శ్రీకాకుళం గిరిజనోద్యమం ఆస్థాయికి ఎదిగింది.

శ్రీకాకుళంజిల్లా కార్యదర్శి బాధ్యతలకి రాజీనామా చేసి కొండమొదలులో గిరిజనోద్యమానికి పునాదులు వేశారు. ఆ క్రమంలోనే రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు స్వీకరించి ఉద్యమ బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీకాకుళ గిరిజనోద్యమం అతివాద కార్యాచరణకి గురై వెనుకపట్టు పట్టడంతో, రాష్ట్ర కమిటీకి, పార్టీ కార్యదర్శి బాధ్యతలకు రాజీనామా చేసిన (దీనికి అనేక కారణాలు, చర్యలు సృష్టించబడ్డాయి) తరువాత ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు విప్లవకారుల ఆర్గనైజింగ్ కమిటీ పేరుతో కొద్దిపాటి శక్తులు వనరులతో విప్లవ సాహిత్యాన్ని, వివిధ రంగాలలో పరిస్థితులు, సమస్యల ప్రాతిపదికగా బుక్‌లెట్స్, కరపత్రాలు అనేకం విడుదల చేశారు. అవన్నీ ఇప్పటికీ, ఎప్పటికీ విప్లవకారులందరికీ మార్గదర్శకంగా ఉన్నాయి. 1988లో సిసిఆర్ఐ (ఎం.ఎల్)లో విలీనం కావడం, 1995లో మరికొన్ని విప్లవ గ్రూపుల కలయికతో సిపిఆర్‌సిఐ (ఎం.ఎల్) నిర్మాణంగా ఏర్పడి 2003 సం. నవంబరు 24 తేదీ వరకు ఆ నిర్మాణ బాధ్యతలు నెరుపుతూ, విప్లవ కార్యాచరణ కృషిలో ఉంటూనే గుండెపోటుతో మరణించారు. ఆయన అనుభవాలతో వ్రాసిన కోర్టు స్టేటుమెంటుగాని, విప్లవకారుల ఐక్యతా సమస్యలపై వ్రాసిన బుక్‌గాని, "నక్సలిజం అంటే వ్యక్తిగత హింసావాదం కాదు, వ్యక్తిగత హింసావాదం పేరుతో నక్సలిజాన్ని వ్యతిరేకించడం మార్క్సిజం కాదు" అనే బుక్‌గాని రీజనల్ కమిటీకి వ్రాసిన లేఖ (తీర్మానం) దిక్సూచి పత్రికలు వివిధ సందర్భాలలో ప్రచురించిన కరపత్రాలు-ఇవన్నీ ఏ నిర్మాణంలోని విప్లవశక్తులకైనా సహకరించే విప్లవ సాహిత్యంగా విప్లవ ప్రజానీకానికీ, నేటి తరానికి ఆయన అందించిన విలువైన అంశాలుగా ఉన్నాయన్నది అందరూ అంగీకరించినా, విశ్వం గారు మాత్రం వాస్తవాలను గుర్తించక, ఆ కామ్రేడ్‌పై వ్యాఖ్యానించిన వ్యాఖ్యలు తన లేకితనానికి, మూర్ఖత్వానికి దర్పణంగా ఉంటాయి.

పాతిక సంవత్సరాలుగా కా॥ రామలింగాచారి పాత్ర గురించి, బాధ్యతలు గురించి ప్రశ్నించనివారు, విశ్వం గారి నిర్మాణానికి కా॥ రామలింగాచారిగారిని ఎందుకు ఇముడ్చుకోలేదని తెలిసో, తెలియకో ప్రశ్నిస్తున్నప్పుడు మేలిమి బంగారంలాంటి విప్లవ నాయకత్వమే అయితే పొరపాటు ఎక్కడ జరిగిందని ఆత్మ విమర్శ చేసుకునేవారు లేదా 2003 నవంబరు 23 వరకు కా॥ వి.ఆర్. సజీవంగానే ఉన్నారు. వీరి నిర్మాణానికి అందుబాటులో కూడా ఉన్నారు. ఆయన బ్రతికున్న కాలంలో పార్టీలో వాతావరణ మాయ గురించిగాని, వాగాడంబర రాజకీయాల గురించిగాని **నేటి తరానికి ఏ అనుభవాన్ని** అందించని ఘనా **పాటీత్వాన్ని గురించి గాని ఎందుకు ఆ కామ్రేడ్‌ని ప్రశ్నించలేకపోయారు? ప్రశ్నిస్తే** ఈ రాజకీయ బండారాన్ని ఉతికి ఆరేస్తారని భయపడ్డారా?

శ్రీకాకుళ ఉద్యమం అతివాద కార్యాచరణకి లోనై, అనేక ఒడుదుడుకులకు గురై వెనుకపట్టు పట్టి సుమారు 35 సం.లు కావస్తుంది. వర్గ సంబంధాలలో మార్పుకు దోహదపడే రాజ్యాంగ యంత్ర అస్థిత్వాన్ని తీవ్రంగా సవాలు చేసే స్థాయి గల వర్గ పోరాట కార్యాచరణ ఏ ఒక్క పార్టీ ఎందుకు కలిగిలేదు? ఇన్ని సంవత్సరాలైనా **నేటికీ ఆటువంటి కార్యాచరణ ఎందుకు లేదు?** ఉద్యమ **నిర్మాణాన్ని నిలకడగా సాగిస్తూ** సరైన విప్లవ **పంథాలో సా....గుతున్నామని మీ గురించి మీరే గొప్పగా** చెప్పుకోవటం కొత్తఏమీ కాదు. **ప్రజాయుద్ధ పంథాలో** వర్గ పోరాట కార్యాచరణను స్థాపితంచేసి **శ్రీకాకుళాన్ని** మించిన ఉద్యమాలు నిర్మించగలగాలి. అంతేగాని చౌకబారు ఆరోపణలు చేయటం చంటోడు చాక్లెట్‌కోసం ఏడ్చినట్లుగా ఉంటుంది.

కా॥ రామలింగాచారి పాత్ర లేకుండా కొండమొదలు ఉద్యమం లేదు. ఆ నిజాన్ని దాచి విశ్వం పార్టీ ఆధ్వర్యంలోనే కొండమొదలు ఉద్యమం సాగిందని చెప్పడం విశ్వంగారి విశ్వరూపానికి తార్కాణం. అసలు విశ్వం ఘనాపాటి బిరుదుకు తగిన వ్యక్తి. ఆ కొలమానం ఆయనకే సరిపోతుంది.

1958 నుండి 1967 వరకు కా॥ వసంతాడ రామలింగాచారి ఆధ్వర్యంలో నిర్మించబడిన శ్రీకాకుళ గిరిజనోద్యమం ప్రజలు విప్లవ కార్యాచరణలోకి వస్తే వారి హక్కులు ఏ విధంగా సాధించుకోవచ్చో, భూమి సమన్య వర్గ కార్యాచరణతో ఎలా పరిష్కరించుకోవచ్చోనన్న విలువైన పాఠాన్ని అందించింది. అంతేకాక రాజ్యాంగ యంత్రంతో ఢీకొనే చైతన్యం ఏవిధంగా ఉంటుందో భావితరాలకు సోదాహరణగా చూపింది. శ్రీకాకుళ గిరిజనోద్యమం అంటేనే ఆచారి లేకుండా లేదు. ఆ ఉద్యమమే నేటికీ ఆదర్శవంతంగా విప్లవనిర్మాణాలు చెప్పుకుంటున్నారు. దాన్ని మించిన ఉద్యమం మనలో ఏ ఒక్కరమూ ఇంత వరకు ఎందుకు నిర్మించుకోలేకపోయామో అందరం ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది అనే అంశాన్ని అందరి ముందు ఉంచింది. ఇంత విలువైన గుణపాఠాలను ఆ కామ్రేడ్ కార్యాచరణతో అందిస్తే విశ్వం గారు వాస్తవాలను వక్రీకరించి, ఆ కామ్రేడ్ యొక్క విప్లవ కార్యాచరణని తక్కువచేసి చూపటం, న్యూనతగా మాట్లాడటం అంటే చరిత్రనే తారుమారు చేసే చర్యగానే ఉంటుంది. ఇటువంటి చౌకబారు వ్యాఖ్యలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

ఇట్లు

ఎన్.అప్పలాచారి, కన్వీనర్, 6.9.08

కా॥ వసంతాడ రామలింగాచారి స్మారక కమిటీ.

సమాధానం

అప్పలాచారి ఈ లేఖ ద్వారా చెప్పదలిచిందేమిటో స్పష్టం కావటంలేదు. అయినా పాఠకులు అర్థం చేసుకోగలరని వ్యాసంలో ఈ భాగాన్ని యిస్తున్నాం.

"యుసిసిఆర్ఐ(ఎం-ఎల్) ఎమర్జెన్సీలో టి.నాగిరెడ్డి మరణానంతరం 1976లో కేంద్ర స్థాయిలో రెండుగా చీలిపోయింది. రెండు కేంద్రాలుగా ఫంక్షన్ కాసాగింది. డి.వి. నాయకత్వాన వున్న కేంద్రంలో ఎమర్జెన్సీని తొలగించిన (1977 మార్చి) తదనంతర పరిస్థితిని అంచనా కట్టడం, ఎన్నికలు తదితర అంశాలపై విభేదాలు మొదలై, సిద్ధాంత పోరాటమా? లేక ఉద్యమ నిర్మాణమా? దేనికి ప్రాధాన్యత యివ్వాలి? అన్న అంచుల దాకా ఆంతరంగిక చర్చలు సాగాయి. రాష్ట్ర కమిటీ కార్యదర్శి రామలింగాచారి కేంద్ర కమిటీ కార్యదర్శి డివికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీని, క్యాడరును త్రిప్పాలని విఫలయత్నం చేశాడు. అతివాద పెడధోరణికి గురై దెబ్బతిన్న శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని పునర్నిర్మించే బాధ్యతగల కమిటీకి నాయకుడిగా కృషి మొదలుపెట్టి ప్రాథమిక ఫలితాలు సాధించిన ఆత్మ సంతృప్తి చెందాడు. కూడగట్టిన నిర్మాణ శక్తులతో శ్రీకాకుళంజిల్లా కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ అడ్రసులేనిదిగా మారి పోవటంతో, తను ఒంటరిగా మిగిలిపోయి వాగాడంబర రాజకీయాలను ఆశ్రయించాడు. అంతేకాక తెచ్చిపెట్టుకున్న గంభీరతతో పార్టీలో వాతావరణ మాయని సృష్టించి, పార్టీ కార్యదర్శి బాధ్యతకూ, రాష్ట్ర కమిటీకీ రాజీనామా చేసి(1977 అక్టోబర్-నవంబర్), నిర్దిష్ట విప్లవ నిర్మాణ బాధ్యత నుండి వైదొలగి వాగాడంబరాన్ని ఆశ్రయించాడు. ఇతరులపై పనికిమాలిన వెటకారం చేసే ప్రక్రియను చేపట్టి, ఏ అనుభవాన్నీ విప్లవ ప్రజానీకానికి, నేటి తరానికీ అందకుండా చేసిన 'ఘనాపాటి'. ఈ ఘనాపాటిని నిలబెట్టుకోలేదనీ, ఇముడ్చుకోలేదనీ మా నిర్మాణాన్ని తెలిసో తెలియకో ప్రశ్నించేవాళ్లు -ఆ నాయకుడి బాధ్యతనూ, పాత్రనూ ప్రశ్నించకుండా, ఉద్యమాన్ని, నిర్మాణాన్ని నిలకడగా సాగిస్తున్న మా నాయకత్వాన్ని దానికి బాధ్యులను చేయటం గత పాతిక సంవత్సరాలుగా సాగుతూనే వుంది." (కా॥ రామలింగాచారి గురించి కా॥ విశ్వం వ్రాసిన వాక్యాలివి.)

కా॥ వసంతాడ రామలింగాచారి పాత్రను దాచిపెట్టి, ఆయన బ్రతికుండగా ఏమీ అనకుండా, ఇప్పుడు ఆయనపై లేకితనపు ఆరోపణలు చేశామన్నది అప్పలాచారి లేఖలోని ఆరోపణ. కా॥ వసంతాడ రామలింగాచారి శ్రీకాకుళంజిల్లా కార్యదర్శిగా పనిచేశారు. జిల్లా కమిటీ చారు మజుందార్ రాజకీయాలను అనుసరించటంతో కార్యదర్శి పదవికీ, జిల్లా కమిటీ సభ్యత్వానికీ రాజీనామా చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఉద్యమాలకు ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం అందించాలన్న ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ (ఏపిఆర్‌సిసి) నిర్ణయం ప్రకారం కా॥ చంద్ర పుల్లారెడ్డి వరంగల్లు, ఖమ్మం ప్రాంత ఉద్యమ బాధ్యతను స్వీకరించగా, కా॥ రామలింగాచారి విశాఖ, తూర్పుగోదావరి ఏజన్సీ ఉద్యమ నిర్మాణ బాధ్యత చేపట్టారు. చరమకాలంలో కొన్ని ఏర్పాట్లు చేసి అంతిమ యాత్రకు ఏర్పాట్లుచేసి గౌరవించాము. గ్రామస్థాయి ప్రజాసంఘాల కార్యకర్తల నుండి కేంద్రస్థాయి పార్టీ నాయకత్వం వరకూ ఏకోన్ముఖంగా చేసే సమష్టి కృషి ఫలితంగానే ఉద్యమాలు నిర్మితమవుతాయి. ఇందులోనే వ్యక్తులుగా ఎవరి పాత్ర వారికుంటుంది. కా॥ విశ్వం వ్రాసిన వ్యాసంలో ఈ అంశాన్ని అసలు చర్చలోకే తీసుకురాలేదు. ఆ తర్వాత కాలంలో కా॥ రామలింగాచారి వైఖరులనే ఆ వ్యాసం ప్రస్తావించింది.

శ్రీకాకుళం ఉద్యమ పునర్నిర్మాణానికి ఏపిసిసిఆర్ తీసుకున్న చర్యలూ, వాటి అమలుతో కొన్ని ప్రాథమిక ఫలితాలు వచ్చాయి. దానితో ఆత్మసంతృప్తి చెంది, ఉద్యమ అనుభవాలను అందించవలసిన బాధ్యతను మరచి, ఇతరులను వెటకారం చేసే వైఖరిని చేపట్టాడన్నదే ఆ వ్యాసంలో వారిపై వున్న విమర్శ. మీ స్మారక కమిటీ ప్రచురించిన కా॥ రామలింగాచారి రచనలను మరోసారి చదివితే అప్పలాచారికే వారి వైఖరి ఏమిటో వాటిల్లో కన్పిస్తుంది.

యుసిసిఆర్ఐ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. కా॥ రామలింగాచారి పనివిధానంపై వచ్చిన అభిప్రాయాలు, విమర్శలు, వాటికి ప్రతిగా రామలింగాచారి వ్రాసిన డాక్యుమెంటు, దీనికి రాష్ట్ర కమిటీ సమాధానం ఇవన్నీ చరిత్రగా రికార్డు అయ్యే వున్నాయి. ఇవన్నీ ఆనాడు పార్టీశ్రేణులకు అందాయి. కా॥ రామలింగాచారి అభిప్రాయాలను చర్చించటం కోసమే ప్రత్యేక కాన్ఫరెన్సును రాష్ట్ర కమిటీ నిర్వహించింది. ఆయన కూడా పాల్గొన్న స్పెషల్ కాన్ఫరెన్సు ఆయన అభిప్రాయాలను తిరస్కరించింది. అయినప్పటికీ పార్టీలో చర్చించే వాతావరణం లేదంటూ వంక పెట్టి పార్టీని వదలి వెళ్లిపోయారు. ఇదంతా అప్పలాచారికి తెలిసినదే. చర్చల ప్రక్రియతో ముగిసిన యీ అంకాన్ని ఆ తర్వాత పాతికేళ్లపాటు పేర్కొనకుండా వుండటమే మేము చేసిన తప్పుగా అప్పలాచారి చిత్రించడం ఏ ప్రయోజనాన్ని నెరవేర్చదు.

ఇక పార్టీని వదలివెళ్లిన తర్వాత కా॥ రామలింగాచారి చేసిందేమిటి?

అనేక వ్యాసాల ద్వారా విప్లవకారులకు **శిరోధార్యమైన సూచనలందజేశారని అప్పలాచారి** అంటున్నారు. కా॥ **విశ్వం వ్రాసిన వ్యాసంలో** రామలింగాచారిపై విమర్శ ఈ అంశం మీదే వుంది. ఒక జిల్లా ఉద్యమానికి దీర్ఘకాలంపాటు నాయకత్వం వహించిన నాయకుడిగా, దాని అనుభవాలనూ, గుణపాఠాలనూ ముందుతరాలకు అందించవలసిన బాధ్యత వుంటుంది. ఆ బాధ్యత నిర్వహించకుండా, ఏ అనుభవాలూ అందించకుండా, ఏ ఆచరణ లేకుండా ఇతరులను ఎద్దేవా చేసుకుంటూ మిగిలిపోయాడన్నదే విమర్శ. ఇంతేకాక నాయకుడిగా కా॥ రామలింగాచారి బాధ్యతను ప్రశ్నించకుండా, ఆయనను యిముడ్చుకోలేకపోవటం మా పార్టీ లోపంగా సాగుతున్న ప్రచారాన్ని కూడా ఆ వ్యాసం ఖండించింది.

శ్రీకాకుళ మంతటిస్థాయికి మరో ఉద్యమాన్ని ఎవరూ నిర్మించలేకపోయారని అప్పలాచారి నిర్ధారించి, దాన్ని మించిన ఉద్యమాన్ని నిర్మించమని సవాలు విసిరారు. మంచిదే. కా॥ విశ్వం వ్యాసంలో చర్చించింది **ఈ అంశాన్నే. వివిధ విప్లవ సంస్థల నాయకత్వంలో** అనేక పాకెట్లలో ఉద్యమాలు సాగుతున్నాయి. వాటిని విస్తరించి ఉన్నతస్థాయికి తీసుకువెళ్లే సమస్య నేటి కాలానిది; యీ పురోగ[illegible]నాన ఆటంకం ఒకే **విప్లవ పార్టీ లేకపోవటమే. విప్లవ పార్టీ** ఏర్పాటుకు అడ్డు తగిలిన అతివాద అవకాశవాదాన్నీ, వివిధ సందర్భాలలో తలెత్తిన అతివాద, మితవాద, ఒంటెత్తువాద ధోరణులను ఎత్తిచూపి, విప్లవోద్యమానికి అవి కలిగించిన హానిని చర్చించిన వ్యాసమిది. విప్లవోద్యమం నేడు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా చర్చించుకుని పరిష్కారాన్ని కనుగొందామని చెప్పిన వ్యాసమిది. ఈ లక్ష్యంతోనే మా నిర్మాణం ఎదుర్కొన్న సమస్యలను ఒక క్రమంలో చర్చించిన వ్యాసమిది.

అప్పలాచారి అసలు విషయాన్ని వదలివేసి, హీనస్థాయి వ్యక్తిగత దూషణలకు దిగటం తనకు ఎక్కడ అలవడిందో ఆత్మపరిశీలన చేసుకొనమని చెప్పటం తప్ప మేము చేయగలిగిందేమీ లేదు.

పి.జస్వంతరావు

సంపాదకుడు-జనశక్తి

(4వ పేజీ తరువాయి)

తినటానికి తిండీ, చేయటానికి చేతిలో పనీలేని నేత కార్మికుడు బ్యాంకుల నుండి తెచ్చిన అప్పులను మాత్రం ఎలా తీర్చగలడు?. ప్రతిరోజూ గడవటానికి తిరిగి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దగ్గరో మైక్రో ఫైనాన్సు సంస్థల దగ్గరకో వెళ్ళి వాళ్ళ ఉచ్చులో యిరుక్కొని, ఆత్మహత్య ద్వారా విముక్తుడవటంకన్నా మరోమార్గం ఆ అభాగ్య కార్మికులకు ఏం మిగులుతుంది?.

అన్ని రకాల అప్పులు (ప్రైవేటు, మైక్రో ఫైనాన్సు, బ్యాంకు) రద్దుచేసి, శాశ్వత ఉపాధి లభించే పథకాలను చేపట్టే బదులు పావలా వడ్డీ, టెక్స్‌టైల్ పార్కులు-అపెరల్ పార్కులు ఏర్పాటులాంటి చర్యల వలన నేత కార్మికుల సమస్యలు పరిష్కరింపబడవు.

బడా కంపెనీలకు యిచ్చే రాయితీలను ఈ చిన్న పరిశ్రమలకు (చేనేత, పవర్‌లూం రంగాలు) యివ్వటం, నేత కార్మికులకు కనీస వేతనం, 8 గంటల పని దినం వంటి సౌకర్యాలు కల్పించటం, కార్మికులందరికీ-వారి కుటుంబాల వారికీ ఉచిత వైద్య సదుపాయం కల్పించటం, నేత కార్మికులకు నిత్యావసర వస్తువులను చౌకదుకాణాల ద్వారా తక్కువ రేటుకు సరఫరా చేయటం, షరతుల్లేని రుణపరపతి కల్పించటం, నేత కార్మికులకు శాశ్వత ఉపాధి లభించేలా చేనేత-పవర్‌లూం రంగ వస్త్రాల అమ్మకానికి తగు చర్యలు తీసుకోవటం ద్వారా చేనేతరంగ కార్మికులను ఆకలి మరణాల పాలు కాకుండా, ఆత్మహత్యలు పాలు కాకుండా నివారించటం సాధ్యమవుతుంది.

ప్రస్తుతం 'సిరిసిల్ల'లో ముఖ్యమంత్రి ప్రకటించిన ప్యాకేజి తాత్కాలిక ఉపశమనాన్ని కల్గించేదే తప్ప అటు సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలను కానీ యిటు రాష్ట్రంలోని యితర ప్రాంతాల చేనేత రంగ కార్మికుల సమస్యలను కానీ శాశ్వతంగా పరిష్కరించదు. ◆

చదవండి! చదివించండి!!

జనశక్తి ప్రచురణ

ముష్టిమెతుకుల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

వెల: 5.00

ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్,
జలీల్ వీధి, విజయవాడ-2.

గుత్త సంస్థల దోపిడీకి గురౌతున్న సుబాబుల్ రైతాంగం

కాగితం పరిశ్రమకు ముడిసరుకుగా వినియోగించే కలప చెట్లయిన సుబాబుల్, యూకలిప్టస్ వంటి తోటల పెంపకం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ఈ తోటలున్నాయి. ఎక్కువ భాగం ప్రకాశంజిల్లాలో వుండగా గుంటూరు, కృష్ణా, ఖమ్మంజిల్లాల్లో కూడా రైతాంగం యీ తోటలను పెంచుతున్నారు.

సామాజిక అడవుల పథకం ద్వారా ప్రభుత్వం ఈ తోటలను రైతాంగానికి పరిచయం చేసింది. తర్వాత పేపరు మిల్లులు వీటిసాగును ప్రోత్సహించాయి. ఎకరం సుబాబుల్ పంట వేయటానికి ఎకరానికి 3,350 రూ. ఖర్చవుతుంది. మూడేళ్లకొకసారి కోతకోస్తే 25-30 టన్నులు కర్ర వస్తుంది. నీటి సౌకర్యాన్నిబట్టి నాలుగైదు కోతలు వస్తాయి. ఆ తర్వాత దుంపతీసి, మళ్లీ కొత్త మొక్క నాటాలి. అంత వరకూ ఎరువులు, పురుగు మందులు మొదలగు పెట్టుబడి ఖర్చులేమీ వుండవు. టన్ను 1500 రూ. రేటు వస్తే, ఏడాదికి ఎకరాకు సగటున 15 వేలు ఆదాయం వచ్చినట్లే. మిగిలిన సాంప్రదాయక పంటలతో పోలిస్తే ఇది మంచి ఆదాయమే. సుబాబుల్ ఆకులు పశుగ్రాసంగా ఉపయోగ పడటంతో పాల ఉత్పత్తి ద్వారా కూడా ఆదాయం వస్తుంది. ఈ కారణాల రీత్యా రైతాంగం మెల్లగా సుబాబుల్ వైపు మొగ్గటం పెరిగింది. కృష్ణాజిల్లాలో మెట్ట ప్రాంతాలైన చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, మైలవరం, తిరువూరు మొదలగు మండలాల్లో 1,50,000 ఎకరాలలో సుబాబుల్ సాగు జరుగుతున్నది.

మార్కెట్టుపై గుత్తాధిపత్యమున్న పేపరు మిల్లులు ఐటిసి, ఏపి పేపర్సు, బల్లార్‌పూర్ వగైరాలు రైతాంగానికి రేటు తగ్గించేందుకు పూనుకున్నాయి. దీనితో రైతాంగంలో ప్రధానంగా ప్రకాశంజిల్లాలో ఆందోళన వచ్చింది. దాని ఫలితంగా మార్కెటింగ్ కమిటీలు రంగం మీదకు వచ్చాయి. ప్రకాశంజిల్లాలో మార్కెటు కమిటీ కోటి రూ.లతో రివాల్వింగు ఫండును ఏర్పాటు చేసింది. కర్రను మార్కెట్టు యార్డులో బహిరంగ వేలానికి పెట్టింది. పేపరు మిల్లులు ఈ వేలంలో కొనుక్కోవాలి. దీనితో రైతాంగానికి 1500-1600 రూ.ల వరకు రేటు అందటమేకాక, చెల్లింపులకు కూడా హామీ ఏర్పడింది. అయితే కృష్ణాజిల్లాలో పేపరు మిల్లులు తమ ఏజంట్ల ద్వారా కొనుగోలు చేస్తున్నాయి. పంటను ప్రోత్సహించటానికి మొదట 1350 రూ.ల వరకూ చెల్లించిన ఐటిసి, కర్ర లావు సైజు తదితర సాకులు చెప్పి రేటు 1100 రూ. తగ్గించటమేకాక, ట్రాన్సుపోర్టు ఛార్జీలంటూ మరో 200 రూ. దిగకోసి 900 రూ. చెల్లిస్తున్నాయి. ఇంతేకాక రైతాంగానికి వారంలోగా పూర్తి చెల్లింపు చేసే పద్ధతి నుండి మెల్లగా నెలలతరబడీ ఆలశ్యం చేస్తున్నారు. నందిగామ మార్కెట్టు యార్డు పరిధిలోనే 2,31,81,932 రూ.లు. రైతాంగానికి చెల్లించవలసిన బకాయిలు పేరుకుపోయి వున్నాయంటే పేపరు మిల్లులు ఎంతగా వాణిజ్య లాభాలు పొందుతున్నాయో అర్థమౌతుంది.

ప్రకాశంజిల్లాలో వున్న మార్కెట్టు యార్డు రివాల్వింగు ఫండ్‌ను ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. దీనికోసమే ఎదురు చూస్తున్న పేపరు మిల్లులు తాము మార్కెట్టు యార్డులో కొనుగోలు చేయబోమనీ, తమ ఏజంట్ల ద్వారా కొంటామనీ యాగీ మొదలుపెట్టాయి. మార్కెట్టు యార్డు జోక్యం వల్ల ఇంత వరకు ప్రకాశంజిల్లా రైతాంగానికి మంచి రేటే వస్తుండగా, ప్రభుత్వమే దానికి తూట్లు పొడిచి, గుత్త కంపెనీల ముందు రైతాంగాన్ని నిస్సహాయులుగా నిలిపేందుకు పూనుకుంది.

సహజంగానే ఈ పరిణామాలు రైతాంగానికి ఆగ్రహం కలిగించాయి. మిగిలిన రైతాంగంలా కాకుండా అప్పుల వత్తిడి తక్కువగా వుండటం, అమ్ముకోకపోతే పంట చెడిపోయే భయం లేనందున చాలాచోట్ల వారు ఆందోళనకు దిగారు. సెప్టెంబరు నెలలో కృష్ణాజిల్లా చందర్లపాడు మండలం తాసీల్దారు కార్యాలయాన్ని వారం రోజులపాటు దిగ్బంధనం చేశారు. టన్నుకు 1600 రూ.లు యివ్వాలనీ, నేరుగా రైతుల నుండే కొనుగోలు చేయాలనీ, అమ్మకాలు మార్కెట్టు యార్డు పర్యవేక్షణలో జరగాలనీ డిమాండు చేశారు. చివరకు వారి డిమాండును అంగీకరించినట్లు కంపెనీలు ప్రకటించాయి. అమలు చేయటానికొచ్చేసరికి తూట్లు పొడుస్తాయన్నది స్పష్టమే. టన్నుకర్రకు 1800 రూ.ల రేటు యివ్వాలనీ, మార్కెట్టు యార్డుల ద్వారానే అమ్మకాలు జరగాలనీ, మధ్యదళారులుండరాదనీ, ట్రాన్స్‌పోర్టు వంటి సాకులతో దిగకోత వుండరాదన్న డిమాండ్లతో రైతాంగం సంఘటితంగా ఉద్యమించాలి.

అదే సమయంలో గుత్త కంపెనీలకు అనుకూలంగా, రైతాంగాన్ని దోపిడీకి గురిచేసేవిగా ప్రభుత్వ విధానాలున్నాయన్న వాస్తవాన్ని రైతాంగం గుర్తించాలి. ప్రతి ఏడూ కాగితం ధరలు పెరిగిపోతూనే వున్నాయి. పేపరు మిల్లులు వందల కోట్లు లాభాలు గడిస్తున్నాయి. అయినా రైతాంగానికి మాత్రం మొండిచెయ్యి చూపుతున్నాయి. రైతాంగానికి గిట్టుబాటు ధర వచ్చేట్లుగా చూడాల్సిన ప్రభుత్వం పేపరు మిల్లుల కనుకూలంగా ప్రకాశంజిల్లాలో రివాల్వింగు ఫండ్‌ను రద్దుచేసి రైతాంగానికున్న రక్షణను రద్దు చేసింది. పేపరుమిల్లులే స్వంతంగా ప్లాంటేషన్ వేసుకునేందుకు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నది. ఏ.పి. పేపరు మిల్సుకు 39 వేల ఎకరాలను యిచ్చింది. పోలవరం ప్రాజెక్టు క్రింద భద్రాచలం ప్రాంతంలో మునక భూములను, గ్రామాలను ఖాళీ చేయించి, ప్లాంటేషన్ వేసుకొనేందుకు ఐటిసి కంపెనీకి అప్పగించింది. ఈ విధంగా గుత్త కంపెనీలకు లాభాలు చేకూర్చే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది.

మెట్ట ప్రాంతాల్లోని రైతాంగం వరిగలు, జొన్నలు, వేరుశెనగ తదితర ఆహార పంటలు వేసుకునేవారు. ఐఎల్‌టిడి కంపెనీ వచ్చి పొగాకు సాగును ప్రోత్సహించింది.

మొదట మంచి రేటు ఇచ్చి రైతాంగాన్ని పొగాకు వైపు తిప్పుకున్న ఐటిసి తర్వాత రైతాంగాన్ని నిలువుదోపిడీ చేసింది. ఈ ప్రాంతానికి నాగార్జునసాగర్ కాల్వలు రాకుండా చేయటంలో ఐటిసి పాత్ర కూడా వుంది. ఫలితంగా రైతాంగం నష్టపోయి, మిర్చి సాగు వైపు మరలారు. మార్కెట్టులో బడా వ్యాపారుల ఆధిపత్యంతోనూ, కొత్త వంగడాలకు చీడలతోనూ నష్టపోయారు. తర్వాత ప్రత్తి సాగు చేపట్టారు. మొదట్లో మంచి ధర వచ్చి విస్తీర్ణం పెరిగింది. కల్తీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులరేట్లతో కంపెనీలు లాభపడ్డాయి తప్ప రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆత్మహత్యల పాలయ్యారు. దీనితో పోలిస్తే సుబాబుల్ కొంత మెరుగ్గా వుందని రైతాంగం ఆశపడి సాగుపెంచుతుండగా, మళ్లీ రైతాంగాన్ని సంక్షోభంలో పడవేస్తున్నారు. నీటిపారుదల సౌకర్యం కల్పించకుండా, పరిశ్రమలకు ముడిసరుకును సరఫరా చేసేవారిగా రైతాంగాన్ని వుంచటమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారు. సూత్రరీత్యా దీనిలో తప్పులేదు. బడా కంపెనీలు రైతాంగాన్ని దోపిడీ చేసుకోకుండా రక్షణ కల్పించవలసిన కర్తవ్యం ప్రభుత్వానికి వుంటుంది. ఈ బాధ్యతను వదలిపెట్టడమే కాకుండా, బడా కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం రైతాంగాన్ని అన్యాయం చేస్తున్నది. కాగితం తయారీ ప్రజలకు అవసరమైన ఉత్పత్తి. పేపరు మిల్లులకు లాభాలు కట్టబెడుతూ రివాల్వింగు ఫండ్ రద్దుచేసి ప్రభుత్వం తన నిజస్వభావాన్ని బయటపెట్టుకుంది.

దోపిడీ వర్గాలు, వారి ప్రభుత్వమూ సాగిస్తున్న ఈ విధానాల ఫలితంగా రైతాంగం యిక్కట్లకు లోనవుతున్నది. ఇంతేకాక సుబాబుల్ సాగుతో పనులు తగ్గిపోయి వ్యవసాయ కూలీల బ్రతుకులు దుర్భరమవుతున్నాయి. కడుపుచేత పట్టుకుని నగర్లాలకు వలసపోయి రిజర్వు నిరుద్యోగ సైన్యంగా నికృష్ట జీవనం గడుపుతున్నారు. మరోవైపున సుబాబుల్ రైతాంగపు బిడ్డలైన యువత కూడా వ్యాపకం లేక పెడదారులు పడుతున్నారు. పట్టణాలకు చేరి వ్యాపారంచేసి లాభం గడించిన ఒకరిద్దరిని చూసి, ఆశతో అనుసరించి నష్టపోతున్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో అశాంతికి దారితీస్తుండగా, పాలకవర్గ పార్టీలు ఈ యువతను తమ స్వార్థ సంకుచిత రాజకీయాలకు వాడుకుంటున్నాయి.

పరిశ్రమాధిపతుల లాభాలను కట్టబెట్టే విధానాలను విడనాడాలనీ, ప్రజావసరాలను తీర్చటం లక్ష్యంగా జాతీయ వ్యవసాయ విధానం వుండాలనీ, వ్యవసాయ రంగంలోకి కార్పోరేట్ల ప్రవేశాన్ని అనుమతించరాదనీ, రైతాంగానికి ఆదాయమూ, కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపే విధంగా వ్యవసాయాభివృద్ధితో అనుసంధానించి పారిశ్రామికీకరణ సాగాలన్న డిమాండులను ముందుకు తెచ్చి, వాటి సాధన కోసం కూడా రైతాంగం ఉద్యమించాల్సిన అవసరం వుంది. తీవ్ర ఆందోళన సాగినప్పుడు ఉపశమనంగా కొంతరేటును పెంచి నీళ్లు జల్లుతారనీ, తిరిగి నిలువు దోపిడీ సాగిస్తారనీ, కనుకనే న్యాయమైన రేటు కోసం ఉద్యమిస్తూనే, రైతాంగ వ్యతిరేక వ్యవసాయరంగ విధానాలను మార్చాలని కూడా ఉద్యమించాలి.

- రాంబాబు

టెర్రరిస్టుల వేట పేరిట ప్రజా హక్కుల కాలరాచివేత

కేంద్రీయ విశ్వవిద్యాలయమైన జామియా మిలియా ఇస్లామియా ఉపకులపతి ముషిరుల్ హసన్ టెర్రరిస్టులుగా అనుమానించి అరెస్టు చేసిన జామియా విద్యార్థులకు న్యాయసహాయం అందించేందుకు విశ్వవిద్యాలయ అధ్యాపకులతో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించాడు. దీనితో ప్రభుత్వ సొమ్ముతో టెర్రరిస్టులను ప్రోత్సహిస్తున్నాడంటూ బిజెపి నిప్పులు కక్కింది. ఈ బ్లాక్‌మెయిల్ పద్ధతికి ఏ మాత్రం తొణకకుండా ముషిరుల్ హసన్ సమాధాన మిచ్చాడు. నేరస్థుడిగా నిరూపితమయ్యే వరకూ నిర్దోషిగానే పరిగణించాలని భారత శిక్షా స్మృతి పేర్కొంటున్నదనీ కనుక వారికి న్యాయమందించటం సరైనదేననీ అన్నాడు. వారు శిక్షింపబడితే మంచిదే, అయితే నా విద్యార్థి ఇలా మారినందుకు బాధపడతాను అన్నాడు. దీనికి ప్రజాధనాన్ని వాడటం లేదనీ, అధ్యాపకులందరూ చందాలు వేసుకుని న్యాయ సహాయ కమిటీ ఏర్పరచారనీ స్పష్టం చేశాడు. గురువును తల్లిదండ్రులుగా చూసే భారత సంస్కృతిలో తన విద్యార్థిపట్ల గురువుకు బాధ్యత లేదా అని ప్రశ్నించాడు. తమ యూనివర్శిటీలో ప్రవేశాన్ని కోరే అభ్యర్థన పత్రంలో విద్యార్థి మతాన్ని తెలుపమని కోరే అంశమే లేదనీ, అయినా జామియా మిలియా టెర్రరిస్టులకు కేంద్రమయిందని నిందలు వేస్తున్నారనీ, ఈ ప్రచార ప్రభావం మా విద్యార్థులపై పడకుండా చూడటం కర్తవ్యమనీ తెలిపాడు. న్యాయ సహాయమందించే నిర్ణయం తానే తీసుకున్నాననీ, కేంద్ర మంత్రికి, యుజిసి ఛైర్మన్‌కు ఈ నిర్ణయాన్ని తెలిపాననీ, వారు నాతో అంగీకరించటమో, విభేదించటమో చేయనవసరంలేదనీ, జామియా లౌకిక విలువల వారసత్వాన్ని కాపాడటమే తన లక్ష్యమని తెలిపాడు. ప్రజాస్వామిక విలువలకోసం నిలిచిన ముషిరుల్ హసన్ అభినందనీయుడు.

ఢిల్లీ బాంబుప్రేలుళ్ళ తర్వాత జామియానగర్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. వరుసగా అరెస్టులు జరిగాయి. దీనిలో జామియామిలియా విద్యార్థులున్నారు. దీనితో జామియా మిలియా టెర్రరిస్టులకు కేంద్ర మయిందన్న ప్రచారం సాగింది. ఈ సందర్భంగా పత్రికలు, టీ.వీ.లు నిర్వహించిన పాత్రపై విమర్శలొచ్చాయి. ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు నకు చెందిన విలువల కమిటీ వీటిని పరిశీలించి నివేదికనిచ్చింది. దీనిని ప్రముఖ పత్రికా సంపాదకుడు కులదీప్‌నయ్యార్ విడుదల చేశారు. ఇలాంటి ఘటనల సందర్భంగా మీడియా వాడుతున్న భాష పక్షపాతంగా వుందని ఆ నివేదిక అభిప్రాయపడింది. వ్యక్తులను టెర్రరిస్టు అని నిర్ధారిస్తున్నారనీ, "ఆరోపితులు", "అనుమానితులు" అన్న పదాలను వాడటంలేదనీ, ఇది విచారణ జరపకుండానే నేర నిర్ధారణ చేయటంతో సమానమవుతుందనీ నిరూపించబడేవరకూ నిర్దోషిగా వరిగణించాలన్న సూత్రాన్ని పాటించలేదనీ వ్యాఖ్యానించింది. మొదటగా వార్త అందించాలన్న తొందరలో టీ.వీ. ఛానెళ్లు ఈ విలువలను ఉల్లంఘిస్తున్నా యనీ, తగిన సమయముండి, భాషను సరిచేసుకోగల సంపాదక సిబ్బంది వుండే పత్రికలు కూడా దీనిని పాటించకపోవటం విచారాన్ని కలిగిస్తున్నదని వ్యాఖ్యానించింది. వాస్తవాన్ని తవ్వి వెలికితియ్యటం మీడియా పని కాదనీ, క్లిష్టమైన కేసులలో అలా మీడియాకు సాధ్యంకాదని పేర్కొంది. అయితే రిపోర్టింగులో ఖచ్చితత్వాన్ని పాటించటం, ఘటనకున్న అనేక కోణాలను ముందుంచటం మీడియా బాధ్యత అన్నది. రాజకీయ నాయకుల ప్రత్యక్ష జోక్యం కన్నా, మీడియా అధినేత వత్తిడివల్లనే విలువలు దెబ్బతింటున్నాయనీ ఈ నివేదికను విడుదల చేస్తూ కులదీప్ నయ్యర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామిక విలువలను చర్చలోకి తెచ్చిన ఘటన ఏమిటి? ఢిల్లీ పోలీసుల కథనం ఇలా ఉంది: ముంబాయి పోలీసులందించిన సమాచారంతో, జామియా నగర్‌లో బాట్లాహౌస్‌లోని ఎల్-18 ఫ్లాటును పోలీసులు చుట్టుముట్టగా, అందులో ఉన్న టెర్రరిస్టులతో జరిగిన ఘర్షణలో మహమ్మద్ అతీఫ్ అమీన్, మహమ్మద్ సాజిద్‌లు మరణించగా, మహమ్మద్ సయీఫ్‌ను పట్టుకోగా, మరో యిద్దరు పారిపోయారు. ఇన్‌స్పెక్టరు శర్మ మరణించారు. ఘటన తర్వాత రోజు నుండీ అతీఫ్ అమీన్ ముఠాకు చెందిన అనుమానితులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారిలో జామియా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ముగ్గురు సాకిబ్ నిస్సార్, జియావుర్ రెహమాన్, మహమ్మద్ షకీల్ వున్నారు.

చనిపోయిన అతీఫ్, సాజిద్‌లు ఇండియన్ ముజాహిదీన్ అన్న సంస్థ నాయకుల్లో ముఖ్యులనీ సెప్టెంబరు 13 నాటి ఢిల్లీ పేలుళ్ళలో బాంబులు అమర్చిందీ ఈ సంస్థేననీ, ఇంతేకాక 2007లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ప్రేలుళ్ళకూ, 2008 జులైలో అహమ్మదాబాదు ప్రేలుళ్లకూ, 2008లో జైపూరు బాంబుప్రేలుళ్లకూ, 2008 జులైలో అహమ్మదాబాదు పేలుళ్లు, అంతకు ముందు హైద్రాబాదు జంట పేలుళ్లు కూడా ఈ సంస్థే చేసిందనీ ఢిల్లీ పోలీసులు స్వయంగా ఇన్‌స్పెక్టరు జనరల్ ప్రకటించారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఉత్తరప్రదేశ్‌లోని అజామ్ ఘర్ జిల్లాకు చెందిన వారనీ, వారి గ్రామాలు టెర్రరిస్టుల అడ్డాగా వున్నాయన్నారు.

పోలీసుల ఈ కథనంపై పలు సందేహాలు తలెత్తాయి. జన్‌హస్తక్షేప్ ఉద్యమం, పీపుల్సు యూనియన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్‌కు చెందిన పలువురు లాయర్లు, కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులూ వాస్తవ సేకరణ కమిటీగా ఏర్పడి పరిశీలన చేశారు. బాట్లా హౌస్ నాలుగంతస్తుల భవనం ఒకే మెట్ల దారి వుంది. తప్పించుకుపోయేందుకు మరోమార్గం లేదు. పోలీసులు దానిని చుట్టివేసిన తర్వాత ఇద్దరెలా తప్పించుకోగలిగారు? అలాగే మృతి చెందిన వారి నుండి కాల్పులు జరిగాయనటానికి ఆధారాలు లేవు. టెర్రరిస్టులను అదుపు చేసే పనిలో దీర్ఘకాలంగా వున్న ఇన్‌స్పెక్టర్ శర్మ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఎందుకు వేసుకోలేదు? ఆ ఫ్లాటులో అద్దెకు దిగే ముందు అతీఫ్ తన వివరాలన్నింటినీ సరిగ్గా తెలుపుతూ ఫ్లాటు యజమాని ద్వారా పోలీసుస్టేషనుకు అందజేశాడు. దాని జిరాక్స్ కాపీ యజమాని వద్ద వుంది. ఎన్‌కౌంటరు జరిగిన గంటలోపే యజమాని దానిని పత్రికలకు ఇచ్చాడు. యజమాని ఫోర్జరీ చేశాడని పోలీసులు అన్నారు. అనుమానం కలిగితే అద్దెకివ్వరు అంతేకానీ ముందుగానే ఫోర్జరీ కాగితాలు తీసి వుంచుకోరు. గంటలో ఫోర్జరీ సాధ్యమూ కాదు. టెర్రరిస్టులు సాధారణంగా ఎవరింట్లోనన్నా దాక్కుంటారుగానీ తామే ఇల్లు అద్దెకు తీసుకోరు. పట్టుబడ్డ సాకిబ్ నిస్సార్ సెప్టెంబరు 26న అహమ్మదాబాదులో బాంబులు అమర్చటంలో సహాయపడ్డాడు (లాజిస్టిక్ సపోర్టు-బాంబులు చేర వేయటంలో సహాయం) అని పోలీసులు ఆరోపిస్తున్నారు. అయితే సెప్టెంబరు 23 నుండి 28 వరకూ అతను ఢిల్లీలో ఎంబిఏ పరీక్షలు వ్రాసాడు. అతను గోల్డుమెడలు పొందిన విద్యార్థి. జామియా నగర్ ప్రాంతంలో భయానక వాతావరణం ఏర్పడిందనీ, ఆ ప్రాంత వాసులను పోలీసులు వేధిస్తున్నారనీ కమిటీ తెలిపింది. ఈ విషయాలు తెలుపుతూ ఈ ఘటనపై వెంటనే న్యాయవిచారణ జరిపించాలని కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్‌ను కోరింది.

ఢిల్లీ అరెస్టులతో ఇటీవలి కాలంలో సాగిన బాంబు ప్రేలుళ్లకు కారకులైన వారందరూ దొరికిపోయినట్లు, ఇక భయపడాల్సిందేమీ లేనట్లు చిత్రించారు. అయితే ఈ కథనంపై కూడా అనేక సందేహాలు తలెత్తాయి. హైదరాబాదు జంట ప్రేలుళ్లకు హుజి కారణమనీ, బంగ్లా దేశీయుడు షాహిద్ బిలాల్‌కు పాకిస్తాన్ గూఢచారి సంస్థ శిక్షణనిచ్చిందనీ, బిలాల్ హైదరాబాదు పాతబస్తీలో వుండి ప్రేలుళ్లు జరిపించాడనీ, తిరిగి పాకిస్తాన్ వెళ్లిపోయాడనీ పెద్దఎత్తున ప్రభుత్వం ప్రచారం చేసింది. హైదరాబాదు ప్రేలుళ్లకు కారణమైనందున ఇతన్ని తమకప్పగించాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్ ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు ఇది ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన, ఢిల్లీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన అతీఫ్ పని అని ప్రకటించారు.

అలాగే 2006 మార్చిలో వారణాసిలో బాంబు ప్రేలుళ్లు జరిగాయి. ఈ కేసును పరిష్కరించి, నేరస్థులైన హాజిని పట్టుకున్నామని ప్రభుత్వం చెప్పింది. వీరిలో ఒకరైన మహమ్మద్ జుబేర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోగా, మహమ్మద్ వలి యుల్లాకు కోర్టు పదేళ్లు శిక్ష వేసింది. ఈ శిక్ష తక్కువనీ, పెద్ద శిక్ష వేయాలంటూ హైకోర్టుకు పోలీసులు అప్పీలు చేశారు. తప్పించుకుని బంగ్లాదేశ్‌కు చేరిన మిగిలిన ముగ్గురు ముద్దాయిలు బషీరుద్దీన్, ముస్తాఫీజ్, జకారియాలను అప్పగించమని కోరుతూ కేంద్ర హోంశాఖా కార్యదర్శి బంగ్లాదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశాడు. ఇండియన్ ముజాహిదీన్ నాయకుడైన అతీఫ్ సారధ్యంలోనే వారణాసి బాంబులు పేల్చబడ్డాయని ఇప్పుడు ప్రకటిస్తున్నారు.

ఇంతేకాక ఢిల్లీ పోలీసులు ఇచ్చిన వివరాల ప్రకారం ఇండియన్ ముజాహిదీన్‌కు నాయకుడూ, లస్కర్ ఏ తోయిబాకు కమాండరు అబూ అల్ కామా. ఇతను కాశ్మీరీ టెర్రరిస్టు. అయితే 2008 ఏప్రిల్‌లో ఇతను

(తరువాయి 7వ పేజీలో)

'తీసుకోని రుణానికి రుణవిముక్తి పత్రం!'

మచిలీపట్నం, 13.10.'08:
ఎక్కడో మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనుల పేరిట భూస్వాములు బ్యాంకుల నుండి రుణాలు తీసుకుంటే, తిరిగి కట్టమని గిరిజనులను వేధించిన ఘటనలను విన్నాం. కృష్ణాజిల్లా ముఖ్యపట్టణం సమీపంలోనే ఇలాంటి ఘటన జరగటం అధికారగణాల భయం సిగ్గులేని అవినీతికి అద్దం పడుతుంది.

కప్పలదొడ్డి గ్రామానికి చెందిన 11 మంది చేనేత కార్మికులు ఆదరణ పథకం క్రింద రుణాలకోసం గతంలో బి.సి.. కార్పోరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇంత వరకూ రుణాలు మంజూరు కాలేదు. కానీ, రుణాలు అందినట్లు, ప్రభుత్వం రుణాలు మాఫీ చేసిన కారణంగా రుణవిముక్తులైనట్లు పత్రాలు పోస్టులో ఆయా కార్మికుల పేరున అందాయి. అసలు రుణాలు మంజూరు కాని వారి పేరున రుణవిముక్తి పత్రాలు అందడమంటే, బినామీ పేర్లతో రుణాలను మధ్య దళారులు, అధికారులు కైంకర్యం చేసినట్లు స్పష్టమౌతున్నది.

ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో బినామీ రుణమాఫీ అక్రమాలపై బహిరంగ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) బందరుశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ వై.సోని మాట్లాడుతూ బినామీ రుణాల మాఫీ అక్రమాలపై విచారణ జరిపించాలని, సంబంధిత అధికారులపై కేసులుపెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ జె.జగన్ మాట్లాడుతూ ఆదరణ పథకం క్రింద చేనేత కార్మికులకు రుణాలు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, 2006లో ఆత్మహత్య చేసుకున్న కప్పలదొడ్డికి చెందిన చేనేత కార్మికుడు పేరిక శ్యామలయ్య కుటుంబానికి రావలసిన పరిహారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కప్పలదొడ్డి గ్రామస్థులు ప్రధానంగా ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాతపాడు గ్రామంలో చెత్త డంపింగ్‌ను ఆపివేయాలి!
– నిజనిర్ధారణ కమిటీ డిమాండు

విజయవాడ నగరంలోని పనికిరాని చెత్త వ్యర్థ పదార్థాలను డంపింగ్ చేయటానికి మున్సిపల్ కార్పొరేషన్ పాతపాడు గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్ చేయడం వలన ఆ ప్రాంత ప్రజలు శారీరక, మానసిక అనారోగ్యాలతో సంవత్సరన్నర నుండి గురౌతున్నారు. ఈ పరిస్థితులను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని పరిస్థితిలో స్థానిక గ్రామాల ప్రజలు సమస్యల పరిష్కారానికి ఆందోళనకు దిగారు.

పై విషయంలోని నిజాలను తెలుసుకుని ప్రజాభిప్రాయాలను సేకరించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావటంలో భాగంగా–

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓ.పి.డి.ఆర్), జన విజ్ఞాన వేదిక, బెజవాడ బార్ అసోసియేషన్–హ్యూమన్ రైట్స్ కమిటీ, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సంస్థలు తమ సభ్యులతో. నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి విజయవాడ రూరల్ ప్రాంతమైన పాతపాడు, సీతారాంపురం, మంగళాపురం, వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాలకు 8.10.'08న వెళ్లి ఆయా గ్రామాల ప్రజలను కలుసుకొని ప్రత్యక్షంగా చూడటం జరిగింది.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులు:

జన విజ్ఞాన వేదిక –1. బండ్ల సాంబశివరావు, 2. జంపా కృష్ణకిషోర్, 3. ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, 4. కోటేశ్వరరావు, 5. బి.దుర్గారావు, ఓ.పి.డి.ఆర్ – 1. కె.ఏసు, 2. వి.యన్.వి.రాజ్యలక్ష్మి, బెజవాడ బార్ అసోసియేషన్ హ్యూమన్ రైట్స్ కమిటీ – 1. పి.శ్రీనివాస్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్-1. సుధాకర్‌రాజు, 2.ఎం.ఎన్.రాయ్

పాతపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు:

1. బెజవాడ నాగేశ్వరరావు, 2. కొండేటి చిన్న వెంకటరత్నం, 3. వేముల సాంబశివరావు, 4. మేడగాని శ్రీనివాసరావు 5. ఆరేటి సామ్రాజ్యం, 6.బోలోజి బూక్యా, 7. పామర్తి సీతారావమ్మ, 8. అనపరెడ్డి సాంబిరెడ్డి, 9. శివారెడ్డి, వీరితోపాటు స్థానిక ప్రజలను కలసి సేకరించిన వివరాలు: భూమి స్వంతదారులు తమ భూములను 40 నుండి 100 అడుగులుపైన లోతుగా త్రవ్వించి ఆ మట్టిని అమ్ముతున్నారు. మట్టిని త్రవ్విన లోయలులాంటి కంధకాలలో (క్వారీలు) విజయవాడ నగర పరిసరాలలోని పనికిరాని చెత్త, వ్యర్థ పదార్థాలను డంపింగ్ చెయ్యడానికి నగర మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించి శాస్త్రీయ పద్ధతులు అమలుపరచకపోవడం ఈ ప్రాంత ప్రజలను నివసించలేని పరిస్థితులకు నెట్టివేసింది.

చెత్తను డంపింగ్ చేసిన క్వారీలను పరిశీలించగా సంవత్సరన్న నుండి వేసిన వ్యర్థ పదార్థాల మీద మట్టిలేయర్ వేయకుండా, ప్రజలు అసౌకర్యానికి గురై ఆందోళనకు దిగిన కారణంగా ఇప్పుడు మాత్రమే మట్టిలేయర్ వేశారు. ఈ లోయలు లాంటి క్వారీలకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవటం వలన ఈ క్వారీలలో పడి కొన్ని గేదెలు మరణించినాయని మరికొన్ని గేదెలు ఈసుకుపోయి పనికిరాకుండా పోయాయని గ్రామస్తులు చెప్పారు. భూగర్భ వనరుల కాలుష్యం కారణంగా **మా దృష్టికి వచ్చిన ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఈ క్రింది విధంగా ఉన్నాయి:**

- చిన్నపిల్లలు 70% నుండి 80% వరకు కామెర్లతోను, పెద్దవారు టైఫాయిడ్, మలేరియా తదితర జ్వరాలతో బాధపడుతున్నారు.
- మంచినీటిని మేము పరిశీలించగా నీటిపై తెల్లని తెట్టు ఏర్పడి నీటి అడుగున మడ్డిలాగా ఏర్పడుతుంది. నీటి రుచిలో కూడా మార్పు గమనించాము.
- ఇక్కడ నీరు త్రాగటం వలన ఈ ప్రాంత పశువుల సూడి నిలబడటం లేదు. మనుషుల మీద కూడా ఈ ప్రభావం ఉంది.
- ఆ పరిసర ప్రాంతాలలో చెత్త డంపింగ్ వలన విపరీతంగా ఈగలు వృద్ధిచెంది మామిడి, కూరగాయల పంటలపై మలవిసర్జన కారణంగా నల్లని మచ్చలు ఏర్పడి అవి వాడకానికి పనికి రాకుండా పోయాయి. ఆ కారణంగా చిన్న చిన్న రైతులు వ్యాపారపరంగా నష్టపోతున్నారు.
- సాయంత్రం 6 గం.లు నుండి దుర్వాసన ప్రారంభమై రాత్రంతా వుంటుంది. అదే సమయంలో పచ్చదోమలు కూడా వచ్చి కుడతాయి. చెత్తపై వుండే పెద్దగాజు ఈగలు ఇళ్లలో ఆహార పదార్థాలపై వాలి, వాటి వలన రోగాలు ఎక్కువవుతున్నాయి.
- ఇక్కడ నీటితో స్నానంచేస్తే అరగంటసేపు ఒళ్లు మంటలు పుట్టి దురదలు వస్తున్నాయి, వీటి కారణంగా అలెర్జీ పొక్కులు వచ్చి అవి నల్లని మచ్చలుగా శరీరంపై ఏర్పడుతున్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా 40 అడుగులపైన తవ్వటం ఫలితంగా నీరు ఇంకిపోయి భూగర్భ జలవనరులు కలుషితం అవుతున్నాయి.

డిమాండ్స్:

1. పాతపాడు గ్రామపంచాయతీ పరిధి నుండి చెత్తడంపింగ్ యార్డును తొలగించాలి. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. క్రొత్తగా డంపింగ్ చేసే ప్రదేశంలో శాస్త్రీయ పద్ధతులను అమలుపరచాలి.
2. సాలిడ్ వేస్టు మేనేజిమెంటు ఏ రూల్స్ ప్రకారం, ఏ పద్ధతుల ప్రకారం చెత్తను డంపింగ్ చెయ్యాలని చెబుతుందో దాని ప్రకారం డంపింగ్ మేనేజిమెంటు చెయ్యాలి.
3. ఈ డంపింగ్‌కి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.

చదవండి! చదివించండి!!
జనశక్తి ప్రచురణ
రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద
వెల: 10.00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్, విజయవాడ-2.

ప్రభుత్వ... (8వ పేజీ తరువాయి)

సంబంధించిన ఎక్కువ, తక్కువల సమస్య కాదని, బేరసారాల జోలికే వెళ్ళబోమని తేల్చి చెప్పారు.

వాన్‌పిక్ కార్యాలయ ముట్టడి

అక్టోబరు 15వ తేదీన చీరాలలోని 'వాన్‌పిక్' కార్యాలయాన్ని దిగ్బంధనం చేయాలని వాన్‌పిక్ వ్యతిరేక అఖిలపక్ష ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమం సన్నాహకంగా తీరప్రాంత గ్రామాల్లో ప్రచార కృషి సాగింది. మండల కేంద్రమైన నిజాంపట్నంలో అక్టోబరు2 నుండీ బాధిత గ్రామాల ప్రజలు రోజుకో గ్రామం నుండి హాజరై నిరాహారదీక్షలు చేపడుతూ తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తూ వస్తున్నారు. ప్రకాశంజిల్లాలో అక్టోబరు 5,6 తేదీలలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర), ఏపిఎఫ్‌టియు బృందం 'వాన్‌పిక్' బాధిత తీరప్రాంత గ్రామాలలో ప్రచారం, నిర్వహించింది. అక్టోబరు 14వ తేదీన ప్రచార కార్యక్రమంలో వున్న కార్యకర్తలను, ప్రజలను పోలీసులు అరెస్టు చేయటం ద్వారా 15వ తేదీ కార్యక్రమాన్ని పోలీసు బలగంతో అడ్డుకోనున్నామని వెల్లడి చేశారు.

15.10.08న చీరాల ఉడ్‌రోడ్డులోనున్న వాన్‌పిక్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ ప్రకటించి, నిషేదాజ్ఞలు విధించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల తీరప్రాంత గ్రామాల నుండి బయలుదేరిన బాధిత ప్రజానీకాన్ని ఎక్కడికక్కడే ఆపివేసి వెనక్కు పంపారు. వాన్‌పిక్ కార్యాలయం వద్దకు చేరుకునేలోపే సిపిఐ, సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కన్నుగప్పి వాన్‌పిక్ కార్యాలయం వద్దకు చేరుకొని, కార్యాలయం ముందు ధర్నా చేయటానికి ప్రయత్నించిన సిపిఐ (ఎం.ఎల్) కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ గ్రామాల ప్రజలపై పోలీసులు లాఠీఛార్జీ జరిపి, బలప్రయోగంతో అరెస్టు చేశారు. అరెస్టులను నిరసిస్తూ చీరాల తహసీల్దార్‌కు మెమోరాండం ఇవ్వటానికి వెళ్తున్న ఊరేగింపును అడ్డుకొని వారందరినీ పోలీసులు అరెస్టు చేశారు. చీరాల పరిసర ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లకు తరలించి, సాయంత్రం వరకు నిర్బంధించి అనంతరం వదలివేశారు.

అరెస్టు అయిన వారిలో సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్, ప్రకాశంజిల్లా సిపిఐ (ఎం.ఎల్) నాయకులు కామ్రేడ్స్ పింజల వెంకట సుబ్బారావు, ఎస్.లలిత, సిపిఐ (ఎం.ఎల్) గుంటూరుజిల్లా నాయకులు కా॥ శోభారాణి, పీపుల్స్‌ఫ్రంట్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం గుంటూరుజిల్లా కార్యదర్శి డి.రమాదేవి, టిడిపి మాజీ మంత్రి పాలేటి రామారావు, ప్రజారాజ్యం పార్టీ నాయకులతోపాటుగా ఈ ఆందోళనకు మద్దతుగా నిలిచిన పిడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి కా॥ అజిత, ఎన్.వై.ఎస్. రాష్ట్ర నాయకులు బి.సుబ్బారావు, వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు, మోటుపల్లి పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు శంకర్, బాలిరెడ్డి; దిండి తదితర తీరప్రాంత గ్రామ ప్రజలు మొత్తం రెండు వందల మంది వరకు అరెస్టు అయినవారిలో వున్నారు.

లాఠీఛార్జీ, అరెస్టులకు నిరసన

ప్రజల కనీసపాటి ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, తమ చిత్తమొచ్చిన విధంగా నిషేదాజ్ఞలు విధిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాల్ని నిరసిస్తూ; వాన్‌పిక్ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్న వారిపై పోలీసుల లాఠీఛార్జీ, అరెస్టులను ఖండిస్తూ అరెస్టు చేసినవారినందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్స్ ఎస్.ఝాన్సి, కె.కోటయ్యలు ప్రకటన విడుదల చేశారు.

చీరాలలో జరిగిన అరెస్టులను, పోలీసు నిర్బంధాన్ని నిరసిస్తూ కృష్ణాజిల్లా బందరులో 15.10.08 సాయంత్రం స్థానిక బస్టాండ్ నుండి కోనేరు సెంటరు వరకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వై.సోని మాట్లాడుతూ వాన్‌పిక్ వ్యతిరేక పోరాటానికి తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.వై.ఎస్., స్త్రీ విముక్తి సంఘటన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చీరాలలో జరిగిన అరెస్టులను ఖండిస్తూ 15.10.08 రాత్రి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నుండి కంకిపాడు వరకు సైకిల్ ర్యాలీ జరిగింది. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు బొట్టా సాంబశివారెడ్డి, లీలా మనోహర్ తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాన్‌పిక్ కార్యాలయం వద్ద ఆందోళనకారులపై లాఠీఛార్జీని అరెస్టును నిరసిస్తూ, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర), ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో గుంటూరుజిల్లా పిడుగురాళ్ళలో 15.10.08 సాయంత్రం స్థానిక లెనిన్ నగర్ నుండి ఐలాండ్ సెంటర్ వరకు ప్రదర్శన అనంతరం ఐలాండ్ సెంటర్‌లో ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ రాస్తారోకో జరిపారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ చెన్నయ్య మాట్లాడుతూ న్యాయమైన తీరప్రాంత ప్రజల ఆందోళనకు మద్దతునిచ్చారు. ప్రజాసంఘాల నాయకులు, బట్టీ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెర్రరిస్టుల ...
(4వ పేజీ తరువాయి)

చనిపోయాడని జమ్మూ–కాశ్మీర్ పోలీసులు ప్రకటించారు. అంతేకాక కాశ్మీరుకు చెందిన ఏ మిలిటెంట్ గ్రూపుకు జైపూరు, అహమ్మదాబాదు, బెంగుళూరు, ఢిల్లీ ప్రేలుళ్లతో సంబంధం లేదని తెగేసి చెప్పారు.

అలాగే ఢిల్లీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన టెర్రరిస్టు యువకుడు అనబడే సాజిద్ వయసు 17 ఏళ్లు మాత్రమేననీ, ఢిల్లీ పోలీసులు చెప్పినట్లు యువకుడు కాదనీ, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఢిల్లీ వచ్చాడని మాజీ సిబిఐ డైరెక్టరు ఆర్.కె.రాఘవన్ తెలిపారు. కేసులు పరిష్కరించాలన్న తొందరలో పోలీసులు ఇలాంటి పనులు చేస్తున్నారా? లేదంటే ఈ లోపాలను ఎలా వివరిస్తారు? ఇలా సాగితే పౌరులకు ప్రభుత్వంపై విశ్వాసం ఎలా ఏర్పడుతుంది? అని రాఘవన్ ప్రశ్నించారు.

బాంబుప్రేలుళ్లు జరగటం ఒక విషయం కాగా, దానిపట్ల ప్రభుత్వమూ, పాలకవర్గ ముఠాలూ, వారి బాకాలూ వ్యవహరిస్తున్న తీరు అనేక అంశాలను ముందుకు తెస్తున్నవి. జరిగిన బాంబు ప్రేలుళ్ళను జాతీయోన్మాదాన్నీ, మతోన్మాదాన్నీ రెచ్చగొట్టే సాధనంగా వీరు వాడుకుంటున్నారని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

బాంబుప్రేలుళ్ల ఘటనను వినియోగించుకుని తమ ప్రాణాలకు రక్షణ లేదన్న అభద్రతా భావాన్ని ప్రజల్లో పెంచటమేకాక, భద్రతా చర్యల పేరిట నిరంకుశాధికారాలను కట్టబెట్టుకుంటున్నారు. అనుమానితులను నిర్మూలించి సాధారణ పరిస్థితిని నెలకొల్పిన రక్షకులుగా పోజుపెట్టి నిరంకుశ చర్యలవల్లే ఇది సాధ్యమైందంటూ ప్రజాస్వామిక హక్కుల కాలరాచి వేతను సమర్ధించుకుంటున్నారు. దీనికంతా ముస్లిములే కారణంగా, ముస్లిములంటే టెర్రరిస్టులుగానూ, ముస్లిము నివాస ప్రాంతాలను టెర్రరిస్టు అడ్డాలుగానూ చిత్రిస్తున్నారు. ఆ సాకుతో ముస్లిము యువకులను విచారణ లేకుండా జైళ్లలో కుక్కుతున్నారు. ప్రజాస్వామిక విలువలను కాపాడవలసిన అవసరాన్ని చూపిన వారిని టెర్రరిస్టు మద్దతుదారులుగా ముద్రలువేసి గొంతు నొక్కివేసేందుకు పూనుకుంటున్నారు. దీనికంతా పొరుగు దేశమే కారణంగా చూపెట్టి జాతీయోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు.

భారత ప్రజలెందుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్యనూ పరిష్కరించలేని భారత పాలకవర్గాలు ప్రజల్లో పెరుగుతున్న అశాంతిని, నిరసననూ ప్రక్కదారి పట్టించేందుకు, దేశ ప్రజలను కుల, మత, ప్రాంతీయ ప్రాతిపదికన చీల్చి వేసేందుకు మొదట నుండి ఈ విధానాలకు పాల్పడుతున్నారు. తమ సమస్యలకు కారణం వ్యవస్థ, పాలకుల విధానాలు కాకుండా ఒక కులమో, ఒక ప్రాంతీయులో, ఒక మతస్తులో కారణమన్న భావాన్ని కలిగించి, దాన్ని విద్వేషాలుగా రగల్చటమే పాలకుల విధానంగా వుంది. బిజెపి దాని అనుబంధ సంస్థ నగ్నమైన ఫాసిస్టు తరహా మతోన్మాద శక్తులుగా దాడులు సాగిస్తుండగా, కాంగ్రెసు లౌకికవాదులుగా చెప్పుకుంటూ, పరోక్ష పద్ధతుల్లో హిందూ మతోన్మాదాన్ని పెంచుతూ, మైనారిటీల రక్షకుడిగా పోజుపెట్టే విధానం అనుసరిస్తున్నది. ఈ విధంగా దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలను రక్షిస్తున్నాయి. దేశ ప్రజానీకాన్ని దోపిడీ, అణచివేతలకు గురిచేస్తున్నాయి.

పాలకముఠాల ఈ విభజించి-పాలించే విధానాన్ని ప్రజల ముందు బహిర్గత పరచాలి; ప్రజల ప్రజాస్వామిక హక్కుల రక్షణకు ఉద్యమించాలి; మతోన్మాదశక్తుల దుర్మార్గపు ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాక, వారి దాడులను ప్రతిఘటించటానికి ప్రజలను సిద్ధం చేయాలి. బాంబు ప్రేలుళ్లను ఖండిస్తూ టెర్రరిస్టు చర్యలు అనాలోచితంగానైనా అంతిమంగా పాలకుల ప్రయోజనాలకే తోడ్పడతాయన్న వాస్తవాన్ని ప్రజల ముందుంచాలి. ప్రజా సమస్యలపై సంఘటిత పోరాటాలను నిర్మించటం ద్వారా వివిధ కులాల, మతాల ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య ఐక్యతను సాధించాలి. ప్రజాతంత్రశక్తులు, విప్లవకారుల ముందున్న కర్తవ్యమిది.

KLVA102M242 8

Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ కొనసాగుతున్న 'వాన్‌పిక్' వ్యతిరేక ఆందోళన

కోస్తా కారిడార్‌లో భాగమైన 'వాడరేవు, **నిజాంపట్నం పోర్టు** ఆధారిత పారిశ్రామిక కారిడార్' **(వాన్‌పిక్)కు వ్యతిరేకంగా** గుంటూరు, ప్రకాశంజిల్లాల **తీరప్రాంత** గ్రామాల ప్రజానీకపు ఆందోళన **కొనసాగుతున్నది.** తమ వృత్తుల్నీ, ఉపాధినీ, ఆరోగ్యాన్నీ, **పర్యావరణాన్నీ,** ప్రకృతి సంపదలనీ, భూముల్ని **సారాంశంలో**-తమ జీవితాల్నే కబళిస్తున్న కోస్తా **కారిడార్‌ను** నిరసిస్తూ ఈ ప్రాంత ప్రజలు వివిధ రూపాల్లో **ప్రభుత్వ అధికారుల్నీ** 'ప్రజాప్రతినిధుల్నీ' నిలవేస్తున్నారు. **సదస్సులు,** సమావేశాలు, సభల ద్వారా చైతన్యయుతులై **సంఘటితంగా** ఆందోళనా కార్యక్రమాల్ని సాగిస్తున్నారు.

ప్రభుత్వ దొంగాటకం

ప్రభుత్వం-తాము పారదర్శకంగా ప్రజల్ని **పాలిస్తున్నామని,** ప్రజలకు సమాచారహక్కు కల్పించామని **మాటలకే** పరిమితమైంది మినహా, నిజానికి ప్రజలకు **'అసలు** విషయాలను', వాస్తవాలను అందజేయకుండా, **తెలియనీయకుండా** చీకటిలోనే వుంచుతున్నది. పదెకరాలు, వందెకరాలలోనే ఎన్నో పెద్ద పరిశ్రమలు నిర్మాణంచేసే అవకాశముండగా -వాడరేవు-నిజాంపట్నంల పరిధిలో 28 వేల ఎకరాల భూములు ఎందుకొరకు ప్రభుత్వం సేకరించబూనుకుంటున్నదీ **గోప్యంగా** ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ భూముల్లో ఏవి పరిశ్రమలను ఏర్పాటు చేస్తారనే ప్రజల ప్రశ్నను **అధికారులు,** మంత్రులు దాటవేస్తున్నారు. ప్రజలు దీన్ని **గమనిస్తున్నారు.** 'అభివృద్ధి' పేరుతో ప్రభుత్వం తమని **దగా** చేస్తున్నదనే విషయాన్ని గుర్తిస్తున్నారు.

ప్రజల ఈ వ్యతిరేకత కారణంగా భూముల సేకరణ **ప్రక్రియలో** కూడా ప్రభుత్వం డొంక తిరుగుడుగా వుంది. **ప్రభుత్వాధికారుల** ద్వారా నేరుగా భూములను సర్వే చేయించి, భూముల సేకరణకు వారిని రంగంలోకి దించలేక **కుట్రపూరితంగా** వ్యవహరిస్తున్నది. 'వాన్‌పిక్' ప్రాంతంలో భూముల సేకరణకు ప్రత్యేక **యంత్రాంగాన్నీ,** కార్యాలయాన్నీ చీరాలలో ఏర్పరచింది. **ఈ ప్రత్యేక కలెక్టర్,** యంత్రాంగం ద్వారా, **'ఈ తీరప్రాంత గ్రామాలన్నింటిలో ప్రజలు భూములు కోల్పోతారని,** ఇష్టపూర్వకంగా వదిలివెళ్ళకపోతే నిర్బంధంగానైనా భూములను స్వాధీనం చేసుకుంటామని, భూములకు సరైన ఆధారాలు (అసైన్డ్ భూములకు) లేవని, ఇప్పుడు లభించిన మేరకైనా తర్వాత నష్టపరిహారం కూడా లభించ'దనే విధంగా హెచ్చరికలు చేయిస్తున్నది. ప్రభుత్వాధికారులు చట్టప్రకారంగా నోటీసులు ఇవ్వకుండానే ఈ విధమైన హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలోనే మాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు, రాజకీయ దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజల ఆందోళనను, భయాలను ఆసరాగా చేసుకొని అందినకాడికి భూముల్ని చౌకగా కొనాలని చూస్తున్నారు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్లనడిగితే తమకివేమీ తెలియవని నాటకాలాడుతున్నారు.

దిండి ప్రాంత ప్రజల ఆందోళన:

నిజాంపట్నం ఎగువున వున్న దిండి పంచాయితీ పరిధిలో 7 గ్రామాలు ఉన్నాయి. ఈ దిండి ప్రాంతంలో 'సిరీన్' కంపెనీ కాలుష్యకారకమైన మందుల పరిశ్రమ నెలకొల్పేందుకు గత సంవత్సరం ప్రయత్నిస్తే ప్రజలు ఐక్యంగా అడ్డుకున్నారు. ఆ ప్రతిపాదన వెనక్కు వెళ్ళిందని ప్రజలు ఆనందంగా ఉన్నంతలోనే 'వాన్‌పిక్' ఉపద్రవం వారిని చుట్టుముట్టింది. ఈ దిండి, అడవుల దీవి ప్రాంతంలోని దాదాపు 3 వేల ఎకరాల భూమి సేకరణకు ప్రభుత్వం పూనుకుంది.

దిండి ప్రాంతంలోని ఇసుక భూములను ప్రజలు గత కొద్ది సంవత్సరాలుగా కష్టించి పనిచేసి సాగుకు అనువుగా మలచుకున్నారు. బోర్లు వేసుకొని, సాగునీటి వసతి కల్పించుకున్న ఫలితంగా, అక్కడి వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించటంతో గతంలో ఎకరాకు 10 బస్తాలు పండే వేరుశెనగపంటను ఇప్పుడు ఎకరాకు 50 బస్తాలు పండించ గలుగుతున్నారు. కొద్దిపాటి మాగాణి భూముల్లో వరి పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున విస్తరించిన తాటితోపుల మీద ఆధారపడి-కల్లు, ముంజలు, తేగలు, తాటాకు సేకరించి అమ్ముకోవటం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఇంట్లోనో, చేను గట్టుమీదనో నాలుగు కొబ్బరి చెట్లు పెంచుకోవటం ద్వారా ఒక కుటుంబ జీవనం గడిచిపోతుందని ప్రజలు చెప్తున్నారు. గొర్రెల పెంపకం ప్రధాన వృత్తిగా, అక్కడి ప్రకృతిపై ఆధారపడి గొర్రెల మందలని సాకుతూ ఆదాయం పొందుతున్నారు. తీరప్రాంతంలో సహజంగా లభించే ఉప్పగా లేదా చప్పగా ఉండే నీటికి భిన్నంగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు తియ్యగా ఉన్న కారణంగా-నీటి ఎద్దడి వున్న వేసవి కాలంలో అడవుల దీవి తదితర చుట్టుప్రక్కల గ్రామాలకు దిండి ప్రాంతం నుండే తాగునీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఫారెస్టు భూములను 'వన సంరక్షణ సమితుల' ద్వారా గ్రామ ప్రజలు సంవత్సరాల తరబడి కష్టపడి, తోటలు పెంచి ఫలసాయం చేతికందుతున్న తరుణంలో ఈ భూములను కూడా వదులుకోవలసి వస్తుందని అధికార్లు చెప్పటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కమ్మని తాగునీటి వసతి, 10-15 అడుగుల లోతులోనే సమృద్ధిగా లభించే భూగర్భ జలాలు, వేరుశెనగ పంటకు, రొయ్యల, చేపల చెరువులకు అనువైన భూములు; మాగాణి భూములు, తాటి తోపులు, కొబ్బరిచెట్లు, గొర్రెల పెంపకం తదితర ఆదాయ వనరులతో కాలుష్య రహిత వాతావరణంలో ఆరోగ్యంగా జీవిస్తూ, ఒకనాటి ఫ్యాక్షన్ రాజకీయాలు, గొడవల నుండి బయటపడి ఇప్పుడిప్పుడే తమ పిల్లలను పై చదువులు చదివించుకుంటూ ఉన్నంతలో హాయిగా బతుకుతున్న తమ జీవితాల్లో 'వాన్‌పిక్' పిడుగుపాటు లాగా వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. తమ భూముల్ని, గ్రామాల్ని వదులుకోబోమని నిశ్చయాత్మకంగా ప్రకటిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే దిండి, అడవుల దీవి ప్రాంతంలో సేకరించతలపెట్టిన భూముల విషయమై ప్రజాభిప్రాయ సేకరణ పేరిట వాన్‌పిక్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సెప్టెంబర్ 8, 12 తేదీల్లో పర్యటించినపుడు ప్రజలు సంఘటితంగా అడ్డుకున్నారు. గ్రామంలోకి రానీయకుండా నిలవేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ భూములు వదులుకోబోమని తెగేసి చెప్పారు. ప్రభుత్వాధికారులను వెనక్కు తిప్పి పంపారు.

చీరాల 'వాన్‌పిక్' కార్యాలయం వద్ద ఆందోళనకారులపై 'లాఠీఛార్జి', అక్రమ అరెస్టులను ఖండించండి!

కోస్తా కారిడార్‌లో భాగంగా 'వాన్‌పిక్' (వాడరేవు-నిజాంపట్నం పోర్టు ఆధారిత పారిశ్రామిక కారిడార్) పేరిట, గుంటూరు, ప్రకాశంజిల్లాల తీర ప్రాంత గ్రామాలలోని 28 వేల ఎకరాల భూమిని సేకరించి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రస్ అల్ ఖైమా; అమెరికాకు చెందిన మ్యాట్రిక్స్ కంపెనీలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. దీనికనుగుణంగా జీ.వో.నెం.34ను విడుదల చేసింది.

దీంతో-తమ భూముల్ని, తీరాన్నీ, వృత్తుల్నీ, ఉపాధినీ, ఆరోగ్యాన్నీ, పర్యావరణాన్నీ-సారాంశంలో తమ జీవితాల్ని ఛిన్నాభిన్నంచేసే వాన్‌పిక్‌కు వ్యతిరేకంగా; ప్రభుత్వ భూముల సేకరణకు వ్యతిరేకంగా ప్రజలు-సదస్సులు, సభలు, సత్యాగ్రహాల ద్వారా సహజంగానే తమ వ్యతిరేకతను కనబరుస్తూ వచ్చారు.

గుంటూరు, ప్రకాశంజిల్లాల్లో, సెప్టెంబరు 8-12 తేదీల్లో, గ్రామ సభల పేరిట ప్రభుత్వం నిర్వహించిన తంతు సందర్భంగా ప్రభుత్వం విధించిన 144 సెక్షన్‌ను ధిక్కరించి మరీ ప్రజలు భూసేకరణకోసం నియమించిన ప్రత్యేక కలెక్టర్ ముందు తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని మన్నించి భూసేకరణ ప్రయత్నాన్ని వెనక్కు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్బంధంగా భూసేకరణకు తన ప్రయత్నాన్ని తీవ్రం చేసింది.

'వాన్‌పిక్'ను వ్యతిరేకించే వివిధ పార్టీల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో గుంటూరుజిల్లాలో పాదయాత్రల అనంతరం నిజాంపట్నంలో బహిరంగ సభను నిర్వహించారు. అక్టోబరు 5, 6 తేదీల్లో ప్రకాశంజిల్లాలో ప్రచారజాతాలు నిర్వహించారు. భూసేకరణ ప్రయత్నాన్ని మానుకోమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇన్ని రకాల ప్రయత్నాల అనంతరం కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో **15.10.2008న చీరాలలో 'వాన్‌పిక్' కార్యాలయం** వద్ద వివిధ పార్టీల ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసు నిర్బంధంతో అణచివేయబూనుకొంది. అనేక మంది నాయకులను, కార్యకర్తలను 'వాన్‌పిక్' కార్యాలయం వద్దకు చేరుకోకుండానే అరెస్టులు చేశారు. కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహిస్తున్న వారిపై పోలీసులు తీవ్రంగా లాఠీఛార్జి చేశారు. లాఠీఛార్జిలో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆపై అరెస్టులు సాగించారు.

పోలీసులు నిర్బంధించినవారిలో సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయకుమార్; సిపిఐ (ఎం.ఎల్) ప్రకాశంజిల్లా నాయకులు పింజల వెంకట సుబ్బారావు, ఎస్.లలితకుమారి; సిపిఐ (ఎం.ఎల్) గుంటూరుజిల్లా నాయకులు ఎం.శోభారాణి; పీపుల్స్ ఫ్రంట్ కన్వీనర్ బొజ్జా తారకం; సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.రమాదేవి; టిడిపి నాయకులు ముమ్మనేని వెంకట సుబ్బయ్య, సత్యప్రసాద్-ఇంకా ప్రజాసంఘాల నాయకులు, వివిధ గ్రామాల ప్రజానీకం వున్నారు.

చీరాలలో వాన్‌పిక్ కార్యాలయం వద్ద నిరసనకారులపై లాఠీఛార్జీ చేయటాన్ని, అరెస్టులు సాగించటాన్ని, ప్రజల ప్రజాస్వామ్యహక్కులను కాలరాయటాన్ని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) తీవ్రంగా ఖండిస్తున్నది. పోలీసులు నిర్బంధించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరినీ వెంటనే విడుదల చేయాలని, 'వాన్‌పిక్' భూసేకరణ ప్రయత్నాలు ఆపాలని, జీ.వో.నెం.34ను రద్దుచేయాలనీ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తున్నది.

15-10-2008
విజయవాడ

కె.కోటయ్య,
కార్యదర్శి

ఎస్.ఝాన్సి,
అధ్యక్షులు

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)

వాన్‌పిక్‌ను నిరసిస్తూ పాదయాత్రలు-బహిరంగ సభ

వాన్‌పిక్‌ను వ్యతిరేకిస్తూ **అఖిలపక్ష ఐక్య కార్యాచరణ** కమిటీ ఆధ్వర్యంలో కోస్తా కారిడార్‌కు, సెజ్‌లకు వ్యతిరేకంగా నిజాంపట్నం మండలంలోని **మోళ్ళగుంట** నుండి ముంద్రేడు, తాళ్ళతిప్ప, పాతూరు, జూలు, కొత్తపాలెం, కొత్తవూరు, నక్షత్రనగర్, సంజీవనగర్, అడవులదీవి, దిండి పంచాయతీలోని ఏడు గ్రామాల మీదుగా నిజాంపట్నం వరకు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో పాదయాత్రలు జరిగాయి. ఈ పాదయాత్రలను 26.9.08న కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్), సిపిఐ, సిపిఎం, టిడిపి, బిఎస్‌పి జిల్లా ప్రతినిధులతో కలిసి స్థానికులు పాల్గొన్నారు. పాదయాత్ర పొడవునా వివిధ గ్రామాలలో సభలు నిర్వహిస్తూ, 'వాన్‌పిక్' ప్రమాదాన్ని, ప్రభుత్వ విధానాల్ని వివరిస్తూ పాదయాత్రలు సాగాయి.

పాదయాత్రల ముగింపు సందర్భంగా నిజాంపట్నం గ్రామంలో ప్రవేశించిన పాదయాత్రల బృందం అప్పటికే వివిధ ప్రాంతాల నుండి అక్కడికి చేరుకున్న ప్రజలతో కలిసి ప్రదర్శనగా సాగి, బహిరంగ సభ ప్రాంతమైన మెయిన్‌బజారు చేరుకుంది. ఈ ప్రదర్శన అగ్రభాగాన-ప్రజాకళాకారులు డప్పుడాన్స్, జనం పాటలతో నడిచారు. బడా పెట్టుబడిదారుడు మాట్రిక్స్ ప్రసాద్, రస్-అల్-ఖైమా ప్రతినిధుల వేషధారణలతో మత్స్యకారుడు, గీత కార్మికుల మెడలో తాళ్ళువేసి, లాగి ఉరి బిగిస్తున్న ప్రజాకళాకారుల దృశ్యీకరణ ప్రజలను ఆలోచింపజేసింది.

27వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన బహిరంగ సభకు అధ్యక్షులుగా కామ్రేడ్ మండవ శోభారాణి (సిపిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు), కేసన శంకర్రావు (టిడిపి నాయకులు) వ్యవహరించారు. సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ ఈ బహిరంగ సభలో మాట్లాడుతూ 'కారిడార్‌లు, సెజ్‌లు విజన్-2020లో భాగంగా వస్తున్నాయని, అభివృద్ధిని కాంక్షించే నాయకులు, మేధావులు ఎవ్వరూ ఇలాంటి 'అభివృద్ధి'ని హర్షించరని, ప్రపంచవ్యాపితంగా రసాయన కర్మాగారాలను అభివృద్ధి చెందిన అనేక దేశాలు మూసివేస్తుండగా, అలాంటి పరిశ్రమలను మన దేశంపై రుద్దటం దారుణమనీ, దీనిని వ్యతిరేకించి మీ, మీ ప్రాంతాలనూ, జీవితాలనూ కాపాడుకోవాల'ని పిలుపునిచ్చారు. ఇంకా, ఈ సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు రావుల వెంకయ్య; టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు; సిపిఎం జిల్లా కార్యదర్శి డి.రమాదేవి, సిపిఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి ముత్తిరెడ్డి శ్రీరాములు తదితరులు మాట్లాడారు. ప్రజాకళాకారులు కారిడార్‌ను వ్యతిరేకిస్తూ పాటలు పాడారు. 'వాన్‌పిక్' బాధిత గ్రామాల నుండి వెయ్యి మందికి పైగా ప్రజలు ఈ బహిరంగసభకు హాజరయ్యారు.

ప్రభుత్వ కొత్త ఎత్తులు

ప్రజలు సంఘటితమౌతూ 'వాన్‌పిక్' విషయమై, భూసేకరణకు వచ్చిన అధికార్లను 144వ సెక్షన్‌ను ధిక్కరించి మరీ నిలవేయటం, తిప్పిపంపటంతో ప్రభుత్వం కొత్త ఎత్తులు వన్నింది. 'వాన్‌పిక్' కోసం నియమించబడిన ప్రత్యేక కలెక్టర్‌ను ప్రక్కకుబెట్టి గుంటూరుజిల్లా కలెక్టర్ అక్టోబరు 5వ తేదీన దిండి గ్రామానికొచ్చారు. మందీ మార్బలమూ, పోలీసు బలగాలు లేకుండా గ్రామంలోకి వచ్చి-కుర్చీని కాదని, ప్రజల మధ్యనే క్రిందకూర్చొని మాటలు ప్రారంభించారు. తాను కూడా వెనుకబడిన కష్టజీవుల కుటుంబం నుండి వచ్చాననీ, తన తల్లి కష్టపడి పనులు చేసుకుంటూ తనను చదివించిందని, కనుక తనకు కష్టాలు, బాధలు తెలుసునని ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేశారు. ప్రజలకు ఇష్టం కాకుంటే బలవంతంగా భూములు తీసుకొనేదేమీ లేదంటూనే, గ్రామాల నుండి ప్రతినిధిబృందం వచ్చి మాట్రిక్స్ ప్రతినిధులతో తన సమక్షంలో సంప్రదింపులు చేయమనే ప్రతిపాదనలతో ముందుకొచ్చారు. కొత్తఎత్తులతో ప్రభుత్వం ప్రలోభపెట్టే ప్రయత్నం చేసినా "భూములు వదులుకోవటానికి సిద్ధంగా లేమనే' విస్పష్ట అభిప్రాయాన్ని ప్రజలు ప్రకటించారు. నష్టపరిహారానికి

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet, Vijayawada-2.
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

[illegible] పుస్తకం పరిశీలనాపట్టిక

[illegible]	KLVA102M242
[illegible]	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	9
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Poyanka
పేజీలు విడదీసినది	Poyanka
స్కాన్ చేసినది	Afsal
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good